www.jananinadam.com

RNI NO:TGTEL/25/A0870

Follow :

జనినాదం

ప్రతి అక్షరం - సామాన్యుడి అయుధం

తెలుగు దినపత్రిక

జిల్లా వారిగా విలేకర్లు కావలెను

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ . అవినీతి పై సమరాన్ని సాగిస్తున్న జనినాదం తెలుగు దినపత్రికలో చేయుటకు అను భవం ఉన్న ఆసక్తి గత వారికి అవకాశం కలదు. అన్ని జిల్లా లు,డివిజన్లు, మున్నిపల్ మరియు మండలాల వారిగా విలేకరుల కావలేను,

సంప్రదించాల్సి నెంబర్

9550100197,9490111460

శనివారం 03-10-2026

సంపుటి : 2 సంచిక : 149

ఆసిఫాబాద్ Asifabad


హైదరాబాద్ Hyderabad

ఎడిటర్ : జాధవ్ రోహిదాష్ Editor: JADAV ROHIDAS

పేజీలు : 04

వెల: రూ.2.00

Simultaneously published from ,Asifabad, Karimnagar, Adilabad , www.jananinadam.com



కెప్టెన్ స్మిత్ మచ్చర్‌కు అశోక చక్ర !

న్యూఢిల్లీ: ఫ్లైదుబాయ్ పైలట్ స్మిత్ మచ్చర్‌ను అశోక చక్ర అవార్డుతో సత్కరించే ఆలోచనలో భారత ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. దుబాయ్ నుంచి ఇజ్రాయెల్ వెళ్తున్న విమానాన్ని కోపైలట్ కూల్చేందుకు ప్రయత్నించగా.. ఆ కుట్రను భగ్నం చేసిన భారత పైలట్ స్మిత్ మచ్చర్‌ను అశోక చక్ర అవార్డు వరించే అవకాశాలు ఉన్నాయి. అత్యంత ధైర్యసాహసాలు ప్రదర్శించే వారిని అశోక చక్ర అవార్డుతో సన్మానించే విషయం తెలిసిందే. సుమారు 180 మంది ప్రాణాలను కాపాడిన మచ్చర్‌పై ప్రపంచ వ్యాప్తంగా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

2



గాంధీ బాటలో వికసిత భారత్

- బాపూజీ ఆశయాలపై మోదీ కీలక సందేశం
- గాంధీజీకి ప్రధాని మోదీ నివాళులు
- బాపూజీ ఆశయాలు మెరుగైన సమాజ నిర్మాణానికి దిక్సూచి అని వ్యాఖ్య
- గాంధీ సిద్ధాంతాలకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉందన్న మోదీ
- గాంధీ జయంతి రోజున ఖాదీ ఉత్పత్తులు కొనాలని పిలుపు
- లాల్ బహదూర్ శాస్త్రికీ నివాళులర్పించిన మోదీ

డిల్లీ: జాతిపిత మహాత్మాగాంధీ ఆశయాలు ఎప్పటికీ మానవాళికి మార్గదర్శకంగా నిలుస్తాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. సత్యం, అహింస, నిరాడంబరత, స్వదేశీ భావనలతో కూడిన బాపూజీ జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.

2



సిరిసిల్ల జిల్లాలో విషాదం..

విద్యుత్‌షాక్‌తో దంపతులు మృతి

గంభీరావుపేట : రాజన్న సిరిసిల్ల జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. గంభీరావుపేట మండల కేంద్రానికి చెందిన గంట దేవయ్య - లక్ష్మి దంపతులు శుక్రవారం వ్యవసాయ పొలం వద్ద విద్యుత్ షాక్ తగిలి అక్కడిక్కడే మృతి చెందారు. దేవయ్య, లక్ష్మి దంపతులు గ్రామ శివారున గల కౌలుకు తీసుకొని వరి పంట సాగు చేస్తున్నారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని కి చేరుకొని కేసు నమోదు చేసుకొని దర్యప్తు చేపట్టారు. మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమత్తం ప్రభుత్వ దవాఖానకు తరలించారు. దేవయ్య, లక్ష్మి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

- 174 మంది ప్రాణాలను కాపాడిన కెప్టెన్ స్మిత్‌తో మాట్లాడిన ప్రధాని మోదీ
- స్మిత్ ధైర్య సాహసాలను కొనియాడి, త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష
- యూఏఈ ఆసుపత్రిలో కోలుకుంటున్న పైలట్
- ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందన్న వైద్యులు
- భారత రాయబార కార్యాలయం పూర్తి సహాయం అందిస్తోందని వెల్లడి

డిల్లీ: ఫ్లైదుబాయ్ విమానంలో కాక్‌పిట్‌లో ప్రాణాపాయ దాడిని ఎదుర్కొని, 174 మంది ప్రయాణికుల ప్రాణాల ను కాపాడిన భారత పైలట్, కెప్టెన్ స్మిత్ మచ్చర్‌తో ప్రధాని నరేంద్ర మోదీ నేడు ఫోన్‌లో మాట్లాడారు. ఆయన ధైర్య సాహసాలను మనస్ఫూర్తిగా ప్రశంసించి, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ప్రపంచవ్యా ప్తంగా చర్చనీయాంశమైన కెప్టెన్ స్మిత్ సాహసాన్ని, ఆయన చూపిన నమయనస్ఫూర్తిని ప్రధాని ప్రత్యేకంగా అభినందించారు. ప్రస్తుతం యూఏఈలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కెప్టెన్ స్మిత్.. విమానంలో జరిగిన భయానక ఘటన గురించి ప్రధానికి వివరించారు.



హీరో పైలట్ స్మిత్‌కు ప్రధాని మోదీ ఫోన్

ఆరోగ్య పరిస్థితిపై ఆరా



2వ పేజీలో...

పాఠశాలల్లో అల్పాహార పథకం

సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు

- డిసెంబర్ 9న రాష్ట్రవ్యాప్తంగా అల్పాహార పథకం ప్రారంభం
- సెంట్రలైజ్డ్ కిచెన్ల ఏర్పాటుకు హరేకృష్ణ ఫౌండేషన్‌తో ఒప్పందాలు
- నాగర్‌కర్నూల్, వికారాబాద్‌లలో వంటశాలల కోసం ముందుకొచ్చిన ప్రైవేటు సంస్థలు
- నవంబర్ 30 కల్లా ఏర్పాట్లు పూర్తి చేయాలని సీఎం రేవంత్ ఆదేశం
- ఆహార నాణ్యత పర్యవేక్షణకు కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేయాలని సూచన

హైదరాబాద్, : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం అమలు చేయనున్న అల్పాహార పథకం ఏర్పాట్లను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వేగవంతం చేశారు. డిసెంబర్ 9వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకాన్ని ప్రారంభించేందుకు వీలుగా నవంబర్ 30 నాటికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ పథకంలో భాగంగా సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ల ఏర్పాటుకు సంబంధించిన ఒప్పందాలు నేడు ముఖ్యమంత్రి సమక్షంలో జరిగాయి. జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో, అత్యాధునిక వంటశాలల ఏర్పాటుకు హరేకృష్ణ ఫౌండేషన్‌కు మద్దతుగా జున్నా సోలార్ సిస్టమ్స్, చైన్ ల్యాబ్స్ ఇండియా సంస్థలు ముందుకొచ్చాయి. నాగర్‌కర్నూల్‌లో కిచెన్ ఏర్పాటుకు జున్నా సోలార్ సిస్టమ్స్ తరఫున సీఎండీ శేఖర్ రెడ్డి, సీఈఓ అనిల్ బాబు రూ. 5.17 కోట్ల చెక్కును, వికారాబాద్‌లో కిచెన్ ఏర్పాటుకు చైన్ ల్యాబ్స్ ఇండియా తరఫున ప్రతినిధి డి. సుమంత్, వైస్ ప్రెసిడెంట్ బుగత సంతోష్ కుమార్ రూ. 4 కోట్ల చెక్కును ముఖ్యమంత్రి చేతుల మీదుగా హరేకృష్ణ ఫౌండేషన్‌కు అందజేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులకు అందించే ఆహారంలో కేలరీలను లెక్కించేందుకు ప్రత్యేక యాప్‌లను వినియోగించాలని సూచించారు.

గాంధీకి వ్యతిరేకంగా ఉన్న..

గాడ్సే భావజాలాన్ని తిప్పికొట్టాలి

- గాంధీ జయంతి వేడుకల్లో పాల్గొన్న డిప్యూటీ సీఎం భట్టి
- గాడ్సే భావజాలాన్ని ప్రతిఒక్కరూ తిప్పికొట్టాలని పిలుపు
- గాంధీ ఆశయాల స్ఫూర్తితోనే తమ ప్రజా ప్రభుత్వం పాలన
- అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా స్కూళ్ల ఏర్పాటు
- వివక్ష లేని సమాజ నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టీకరణ



2వ పేజీలో...



కొడంగల్‌లో సభతో రేవంత్ రెడ్డికి చెమటలు పట్టిస్తాం

కొడంగల్‌లో బీఆర్ఎస్ సభ పెడతామన్న తలసాని

- సిరిసిల్లలో బలప్రదర్శన చేయాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్న
- ఖైరతాబాద్ ఉపఎన్నికలో బీఆర్ఎస్ గెలుపు ఖాయమని ధీమా


హైదరాబాద్: తెలంగాణలో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య రాజకీయ పోరు మరింత తీవ్రమైంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గమైన కొడంగల్‌లోనే భారీ బహిరంగ సభ నిర్వహించి, కాంగ్రెస్ ప్రభుత్వానికి నవాల్ వినురుతామని బీఆర్ఎస్ ప్రకటించింది. హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. "కొడంగల్‌లో మేము పెట్టబోయే సభతో ముఖ్యమంత్రికి చెమటలు పట్టిస్తాం" అని ఆయన హెచ్చరించారు. సిద్దిపేటలో సీఎం రేవంత్ రెడ్డి సభ ముగిసిన తర్వాత కొడంగల్‌లో బీఆర్ఎస్ సభ ఉంటుందని తలసాని స్పష్టం చేశారు.



శాంతియుత పోరాటాల ద్వారా సామాజిక మార్పు సాధించడమే గాంధీజీ ఆశయం

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

హైదరాబాద్, : మహాత్మాగాంధీ అనుసరించిన ప్రజాస్వామిక శాంతియుత పోరాట కార్యాచరణ తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో తనకు స్ఫూర్తిగా నిలిచిందని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తెలిపారు. ప్రజాస్వామిక హక్కుల సాధనకోసం గాంధీజీ అనుసరించిన సత్యాగ్రహ పంథా నేటి యువతరానికీ ఆచరణీయమన్నారు.



2వ పేజీలో...

ఉక్రెయిన్ వార్‌ను ఆపే మంచి ఆలోచనలు మోదీ వద్ద ఉన్నాయి

రష్యా అధ్యక్షుడు పుతిన్

మాస్కో: ప్రధాని మోదీని పుతిన్ ప్రశంసించారు. ఉక్రెయిన్‌తో యుద్ధాన్ని ముగించే అంశంపై ప్రధాని మోదీ వద్ద మంచి ఐడియాలు ఉన్నాయంటూ రష్యా అధ్యక్షుడు పుతిన్ పేర్కొన్నారు. ఉమ్మడి అంగీకారం ద్వారా యుద్ధాన్ని ఆపే ఐడియాలు మోదీ వద్ద ఉన్నట్లు పుతిన్ తెలిపారు.తనతో భేటీ అయిన ప్రతిసారి యుద్ధాన్ని ఆపే అంశం గురించి ఆయన చర్చిస్తుంటారని పుతిన్ పేర్కొన్నారు.



2వ పేజీలో...

రేవంత్, కేటీఆర్ ఆస్తులపై విచారణ జరపాలి

ఎంపీ రఘునందన్ రావు డిమాండ్

- రేవంత్, కేటీఆర్ ఆస్తులపై సిట్టింగ్ జడ్జితో విచారణకు డిమాండ్
- సోమవారం లోగా లేఖ రాయాలని, లేదంటే తానే రాస్తానని వెల్లడి
- తన ఆస్తిపైనా విచారణకు సిద్ధమని ప్రకటించిన బీజేపీ ఎంపీ

సంగారెడ్డి : తెలంగాణ రాజకీయాల్లో ఆస్తుల విచారణ సవాళ్లు మరింత ముదురుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆస్తులపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని బీజేపీ ఎంపీ రఘునందన్ రావు డిమాండ్ చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలలోని నేతలు దొంగలేనని ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

మహబూబాబాద్ జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో..

ఘనంగా గాంధీ జయంతి వేడుకలు

మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన ఎస్పీ డా. శబరీష్, ఐ.పి.ఎస్.





మహబూబాబాద్, అక్టోబర్ 2:జాతిపిత మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం మహబూబాబాద్ జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఘనంగా గాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ డా. శబరీష్, పి., ఐ.పి.ఎస్. ముఖ్య అతిథిగా విచ్చేసి మహాత్మా గాంధీ చిత్రవటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్య పోరాటంలో మహాత్మా గాంధీ అందించిన సేవలను, అహింస, సత్యం, శాంతి వంటి ఆయన అమూల్యమైన సిద్ధాంతాలను స్మరించుకున్నారు. గాంధీజీ ఆశయాలు నేటి ఆధునిక పోలీసు వ్యవస్థకు ఎంతో మార్గదర్శకమని ఆయన పేర్కొన్నారు. ప్రతి పోలీసు సిబ్బంది గాంధీజీ జీవితం నుండి స్ఫూర్తి పొంది, ప్రజలకు అందుబాటులో ఉంటూ నిబద్ధతతో, పారదర్శకతతో విధులు నిర్వర్తించాలని పిలుపునిచ్చారు.సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణ, మత సామరస్యం మరియు ప్రజా రక్షణ కోసం పోలీసులు మరింత బాధ్యతాయుతంగా పనిచేయాలని ఎస్పీ సూచించారు. ప్రతి పౌరుడి హక్కులను గౌరవిస్తూ, సామాజిక న్యాయం మరియు సమానత్వం అనే గాంధీయ సూత్రాలకు అనుగుణంగా ప్రజలతో మమేకం కావాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ టౌన్ ఇన్స్పెక్టర్ రఘుపతి రెడ్డి, ఆర్.ఐలు భాస్కర్, నాగేశ్వర్రావు,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గాంధీకి వ్యతిరేకంగా ఉన్న గాడ్సే భావజాలాన్ని తిప్పికొట్టాలి



మొదటిపేజీ తరువాయి...

హైదరాబాద్: గాంధీ జయంతిని పురస్కరించుకుని జాతిపిత మహాత్మా గాంధీకి తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఘన నివాళులర్పించారు. గాంధీజీ ఆశయాల స్ఫూర్తితోనే రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని, వివక్ష లేని సమాజ నిర్మాణమే తమ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. గాడ్సే భావజాలాన్ని వ్యాప్తి చేస్తూ, స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రను వక్రీకరించేందుకు జరుగుతున్న ప్రయత్నాలను ప్రతి ఒక్కరూ ఐక్యంగా తిప్పికొట్టాలని ఆయన పిలుపుని చ్చారు. హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో టీపీసీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన గాంధీ జయంతి వేడుకల్లో ఉప ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి ఆయన శ్రద్ధాంజలి ఘటించారు. సత్యం, అహింస, శాంతి మార్గాల ద్వారా దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించేలా చేసిన గాంధీజీ ఆశయాలు నదా న్ఫూర్తిదాయకమని ఈ నందర్భంగా కొనియాడారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ, గాంధీజీ చూపిన మార్గంలోనే తమ ప్రభుత్వం పయనిస్తోందని పేర్కొన్నారు. కులమతాలకు అతీతంగా విద్యార్థులందరికీ అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో విద్యను అందించాలనే ఉద్దేశంతో 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల'ను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. వివక్షకు తావులేని సమసమాజ నిర్మాణమే ప్రజా పాలన అంతిమ లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు.

గాంధీ బాటలో వికసిత భారత్

మొదటిపేజీ తరువాయి...

గాంధీజీ చూపిన బాటలో నడుస్తూ మెరుగైన సమాజంతో పాటు వికసిత భారత్ నిర్మాణం దిశగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. గాంధీ జయంతి సందర్భంగా మహాత్ముడికి నివాళులర్పించిన మోదీ.. ఆయన సందేశాలను గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా 'ఎక్స్' వేదికగా స్పందించిన ప్రధాని.. బాపూజీ శాశ్వత సందేశం మెరుగైన సమాజం, వికసిత భారత్ నిర్మాణానికి నిరంతరం దిశానిర్దేశం చేయాలని ఆకాంక్షించారు. గాంధీజీ జీవితం సత్యం, అహింస, కరుణ, సేవలకు నిలువెత్తు నిదర్శనమని పేర్కొన్నారు. ప్రతి కాలంలోనూ మానవాళికి ఆయన జీవితం మార్గం చూపుతుందని అన్నారు. వీడియో సందేశంలోనూ గాంధీజీ గొప్పతనాన్ని మోదీ వివరించారు. అక్టోబరు 2 ప్రాధాన్యం దేశంలోని ప్రతి చిన్నారికీ తెలుసని అన్నారు. అధికారానికి దూరంగా ఉన్నప్పటికీ కోట్లాది మంది ప్రజల హృదయాల్లో గాంధీజీ ఇప్పటికీ నిలిచిపోయారని పేర్కొన్నారు. ఆయన సిద్ధాంతాల ప్రభావం మానవాళిపై ఉన్నంతకాలం ఆ ఆశయాలు స్ఫూర్తినిస్తూనే ఉంటాయని తెలిపారు. గాంధీజీ స్వదేశీ భావనకు ఎంతో ప్రాధాన్యమిచ్చారని, ఖాదీ దానికి ప్రధాన చిహ్నమని ప్రధాని గుర్తుచేశారు. గాంధీ జయంతి సందర్భంగా ప్రతి ఒక్కరూ ఖాదీ ఉత్పత్తులను కొనుగోలు చేయాలని కోరారు. స్వదేశీ వస్తువులను గర్వంగా వినియోగించాలని పిలుపునిచ్చారు. లాల్ బహదూర్ శాస్త్రికీ నివాళులు..: దేశ రెండో ప్రధానమంత్రి లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా ఆయన్ను కూడా ప్రధాని మోదీ స్మరించుకున్నారు. ఆయన నిరాడంబరత, దేశం పట్ల అంకితభావం ఎంతో స్ఫూర్తిదాయకమని 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. న్యూఢిల్లీలోని విజయ్‌ఘాట్ వద్ద శాస్త్రి సమాధికి నివాళులర్పించారు. 'జై జవాన్.. జై కిసాన్' నినాదంతో సైనికులు, రైతుల్లో కొత్త స్ఫూర్తి నింపిన గొప్ప నాయకుడని కొనియాడారు. బయటకు ఎంతో నిరాడంబరంగా కనిపించినా.. సంకల్పంలో మాత్రం లాల్ బహదూర్ శాస్త్రి రాతిలా దృఢంగా ఉండేవారని మోదీ గుర్తుచేశారు. రైతులు, సైనికుల సహకారంతో దేశం విజయాలు సాధించేందుకు శాస్త్రి చూపిన మార్గం చిరస్మరణీయమని అన్నారు.

హీరో పైలట్ స్మిత్‌కు ప్రధాని మోదీ ఫోన్

మొదటిపేజీ తరువాయి...

మత ఛాందసవాదిగా భావిస్తున్న కో-పైలట్ దాడిని ఎదుర్కొనే ధైర్యం తనకు ఎలా వచ్చిందో తెలిపారు. అంతకుముందు గురువారం కూడా ప్రధాని మోదీ.. స్మిత్ కుటుంబ సభ్యులతో మాట్లాడి, ఆయన సాహసా న్ని కొనియాడారు. భారత ప్రభుత్వం, విదేశాంగ మిషన్లు పైలట్‌కు అన్ని విధాలా సహాయసహకారాలు అందిస్తున్నాయని ప్రధాని వారికి భరోసా ఇచ్చారు.ఆరోగ్యం నిలకడగాఉంది: భారతరాయబారి ప్రస్తుతం యూఏఈలోని ఆసుపత్రిలో కోలుకుంటున్న కెప్టెన్ స్మిత్ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని అధికారులు తెలిపారు. యూఏఈలో భారత రాయబారి దీపక్ మిట్టల్.. స్మిత్ మచ్చర్‌ను, ఆయన కుటుంబాన్ని ఆసుపత్రిలో పరామర్శించారు. "ఆయన మాతో స్వేచ్ఛగా మాట్లాడారు. నవ్వుతూ, ఉల్లాసంగా కనిపించారు. ఇది మాకు, ముఖ్యంగా ఆయన కుటుంబానికి ఎంతో ఉపశమనాన్ని ఇచ్చింది" అని రాయబారి తెలిపారు. స్మిత్‌కు అత్యుత్తమ వైద్యం అందుతోందని, యూఏఈ అధికారులతో భారత రాయబార కార్యాలయం నిరంతరం సంప్రదింపులు జరుపుతోందని మిట్టల్ వివరించారు. దాడి జరిగిన తర్వాత సౌదీ అరేబియా నుంచి స్మిత్‌ను ప్రత్యేక విమానంలో దుబాయ్‌లోని ఆసుపత్రికి తరలించారు. "కెప్టెన్ స్మిత్ ఎంతో ధైర్యాన్ని, సాహసాన్ని ప్రదర్శించి పెను విషాదాన్ని నివారించారు. ఎన్నో విలువైన ప్రాణాలను కాపాడారు. భారతదేశపు ఈ వీర పుత్రుడిని చూసి మేం గర్విస్తున్నాం. ఆయనకు పూర్తి సహకారం అందిస్తాం" అని అంతకు ముందు ఒక ఇంటర్వ్యూలో మిట్టల్ పేర్కొన్నారు.

తెలంగాణలో భారీగా పెరిగిన ఆటో ఛార్జీలు

- **తెలంగాణలో 12 ఏళ్ల తర్వాత సవరించిన ఆటో ఛార్జీలు**
- **కనీస ఛార్జీ రూ. 30, ఆ తర్వాత కిలోమీటరుకు రూ. 14గా నిర్ధారణ**
- **రాత్రి 11 నుంచి ఉదయం 5 వరకు ఒకటిన్నర రెట్లు అధిక ఛార్జీ**
- **మూడు నెలల్లో మీటర్లు మార్చాలని డ్రైవర్లకు ఆదేశాలు**
- **పెరిగిన ఖర్చుల దృష్ట్యా ప్రభుత్వ కమిటీ సిఫారసులతో నిర్ణయం**



హైదరాబాద్, : తెలంగాణలో సామాన్యులపై మరో భారం పడింది. రాష్ట్రవ్యాప్తంగా ఆటో రిక్షా ఛార్జీలను పెంచుతూ రవాణా శాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. దాదాపు 12 ఏళ్ల విరామం తర్వాత ఈ ఛార్జీలను సవరించడం గమనార్హం. నూతన ఛార్జీల ప్రకారం, కనీస ఛార్జీని (తొలి 1.6 కిలోమీటర్లకు) రూ.30గా నిర్ణయించారు. ఆ తర్వాత ప్రయాణించే ప్రతి అదనపు కిలోమీటరుకు రూ.14 చొప్పున వసూలు చేయనున్నారు.
ఈ ఉత్తర్వుల ప్రకారం, రాత్రి సమయ ఛార్జీలను కూడా సవరించారు. రాత్రి 11 గంటల నుంచి తెల్లవారుజామున 5 గంటల మధ్య సాధారణ ఛార్జీపై ఒకటిన్నర రెట్లు అధికంగా వసూలు చేస్తారు. ప్రయాణికుల కోసం వేచి ఉండే సమయానికి (వెయిటింగ్ ఛార్జీలు) నిమిషానికి 75 పైసలుగా ఖరారు చేశారు. ప్రస్తుతం ఉన్న డిజిటల్ మీటర్లను కొత్త ఛార్జీలకు అనుగుణంగా మార్చుకునేందుకు ఆటో డ్రైవర్లకు మూడు నెలల గడువు ఇచ్చారు. ఈలోగా పాత, కొత్త ఛార్జీల వివరాలతో కూడిన టారిఫ్ కార్డులను ఆటోల్లో తప్పనిసరిగా ప్రదర్శించాలని ప్రభుత్వం ఆదేశించింది. చివరిసారిగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ హయాంలో 2014 ఫిబ్రవరిలో ఆటో ఛార్జీలను సవరించారు. వాహనాల కొనుగోలు వ్యయం, ఇంధన ధరలు, నిర్వహణ ఖర్చులు, బీమా, డ్రైవర్ల జీవన వ్యయం పెరిగిన నేపథ్యంలో ఛార్జీలు పెంపును సిఫారసు చేస్తూ ప్రభుత్వ నియమించిన కమిటీ నివేదిక సమర్పించింది. ఈ సిఫారసుల మేరకే ప్రభుత్వం తాజా నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్ మెట్రో, టీజీఎస్ఆర్టీసీ బస్సుల కోసం కామన్ పాస్‌ను ప్రారంభించిన రోజే ఈ ఛార్జీల పెంపు ఉత్తర్వులు వెలువడటం గమనార్హం.

పాఠశాలల్లో అల్పాహార పథకం..

మొదటిపేజీ తరువాయి...

స్థానిక ఆహారపు అలవాట్లకు అనుగుణంగా మెనూ ఉండాలని, ఆహార నాణ్యతను నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం దీర్ఘకాలం కొనసాగేలా సెంట్రల్ కిచెన్లను కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానించాలని ఆదేశించారు. విద్యార్థుల్లో పోషకాహారం విలువలను పెంచి, హాజరుశాతాన్ని మెరుగుపరచడమే ఈ పథకం ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, హరేకృష్ణ ఫౌండేషన్ ప్రతినిధి సత్య గౌర చంద్రదాస్ స్వామీజీ తదితరులు పాల్గొన్నారు.

కెప్టెన్ స్మిత్ మచ్చర్‌కు అశోక చక్ర!

మొదటిపేజీ తరువాయి...

భారత ప్రధాని మోదీ, అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యహూ కూడా ఆ పైలట్‌ను ఓ హీరోగా కీర్తించారు. గుజరాతీ మూలాలు ఉన్న ఆ పైలట్‌కు ఇప్పటికే గుజరాతీ సర్కారు విశిష్ట గుజరాత్ గిరిమా అవార్డును ప్రకటించింది. అతని ధైర్యసాహసాలను మెచ్చుకున్నది. సోమనాథ్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించింది. మచ్చర్ త్వరగా కోలుకోవాలని కాశీ విశ్వనాథ్ ఆలయంలో కూడా పూజలు చేశారు. ఒకవేళ మచ్చర్‌కు అశోక చక్ర ప్రదానం చేస్తే, అప్పుడు ఆ అవార్డును గెలుచుకున్న రెండో ఏవియేషన్ వ్యక్తిగా ఆయన నిలుస్తారు. 1987లో పాన్ ఆమ ఫ్లయిట్ 73లో సీనియర్ ఫ్లయిట్ పర్సర్‌గా చేసిన నీరజ్ భానోత్‌కు గతంలో అశోక చక్ర ఇచ్చారు. హైజాక్ అయిన ఫ్లయిట్‌లోని ప్రయాణికుల్ని రక్షించిన ఆయన తన ప్రాణాలను త్యాగం చేశారు. ప్రస్తుతం మచ్చర్ కూడా తెగువ చూపించినట్లు ప్రశంసలు.

బీజేపీలో చేరిన సీరియల్ నటులు

- సామాన్యులను కాంగ్రెస్, బీఆర్ఎస్ పట్టించుకోవడం లేదని రాంచందర్ రావు విమర్శ
- రాష్ట్రంలో బీజేపీ ప్రత్యామ్నాయ శక్తిగా ఎదుగుతోందని వ్యాఖ్య



హైదరాబాద్: తెలంగాణలో బీజేపీలో పలువురు టెలివిజన్ సీరియల్ కళాకారులు చేరారు. హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఈరోజు జరిగిన కార్యక్రమంలో టీవీ నటి వేములపల్లి స్వర్ణలతతో పాటు మరికొందరు సీరియల్ నటులు కాషాయ కండువా కప్పుకున్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు వారికి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా రాంచందర్ రావు మాట్లాడుతూ... అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీలపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఆ రెండు పార్టీలు ఒకరిపై ఒకరు అక్రమ సంపాదన ఆరోపణలు చేసుకోవడంలోనే మునిగిపోయాయని, సామాన్యుడు ఏం సంపాదించాడని ఎప్పుడైనా పట్టించుకున్నాయా అని ప్రశ్నించారు. వంద రోజుల్లో బీఆర్ఎస్ అవినీతిని బయటపెడతామని చెప్పిన కాంగ్రెస్, వెయ్యి రోజులు గడిచినా ఒక్కరినీ జైలుకు పంపలేకపోయిందని ఆయన ఎద్దేవా చేశారు. అవినీతిలో కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒకదానితో ఒకటి పోటీ పడుతున్నాయని రాంచందర్ రావు ఆరోపించారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద ప్రీమియం చెల్లించకుండా రాష్ట్ర ప్రభుత్వం రైతులను మోసం చేస్తోందని, తమ సమస్యల పరిష్కారం కోసం నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులను అరెస్ట్ చేయించిందని మండిపడ్డారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే విద్యార్థులు, ఉపాధ్యాయులు, రైతుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ వైఖరితో ప్రజలు విసిగిపోయారని, రాష్ట్రంలో బీజేపీ ప్రత్యామ్నాయ శక్తిగా ఎదుగుతోందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. వినోద రంగంలోని ప్రముఖులను చేర్చుకోవడం ద్వారా పార్టీ బలోపేతానికి బీజేపీ చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా ఈ చేరికలు జరిగాయి.

రేవంత్, కేటీఆర్ ఆస్తులపై విచారణ జరపాలి

మొదటిపేజీ తరువాయి...

సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురంలో ఈరోజు మీడియాతో మాట్లాడు తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి, కేటీఆర్ తమ ఆస్తులపై విచారణ కోరుతూ సోమవారం లోగా హైకోర్టుకు లేఖ రాయాలని రఘునందన్ సవాల్ విసిరారు. ఒకవేళ వారు స్పందించక పోతే, తానే స్వయంగా హైకోర్టుకు లేఖ రాస్తానని స్పష్టం చేశారు. అవసరమైతే ముగ్గురం కలిసి సిట్టింగ్ జడ్జికి విచారణ కోసం విజ్ఞప్తి చేద్దామని, తన ఆస్తులపైనా విచారణకు తాను సిద్ధమేనని ప్రకటించా రు. ఇటీవల సిరిసిల్ల సభలో కేటీఆర్ ఆస్తుల గురించి సీఎం రేవంత్ రెడ్డి ఆరోపణలు చేయగా, దానికి ప్రతిగా తమ ఇద్దరి కుటుంబాల ఆస్తులపైనా న్యాయ విచారణ జరిపించాలని కేటీఆర్ సవాల్ చేశారు. ఈ సవాళ్లు, ప్రతిసవాళ్ల నేపథ్యంలో ఇప్పుడు బీజేపీ కూడా ఈ అంశాన్ని తెరపైకి తేవడం రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తికరంగా మారింది.

కొడంగల్‌లో సభతో రేవంత్ రెడ్డికి చెమటలు పట్టిస్తాం

మొదటిపేజీ తరువాయి...



ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి... బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నియోజకవర్గమైన సిరిసిల్లలో సభ నిర్వహించడాన్ని ఆయన ప్రస్తావించారు. సిరిసిల్ల ఏమైనా పక్క రాష్ట్రంలో ఉందా? అని ప్రశ్నిస్తూ... సిరిసిల్లలో బలప్రదర్శన చేయాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. ఆ సభ వల్ల సీఎంకు రాజకీయంగా నష్టమే జరిగిందని అన్నారు. ఇదే సందర్భంగా, ఖైరతాబాద్ ఉపఎన్నికపై తలసాని పూర్తి ధీమా వ్యక్తం చేశారు. ఆ ఎన్నికలో బీఆర్ఎస్ వందకు వంద శాతం గెలుస్తుందని జోస్యం చెప్పారు. పార్టీ మారిన దానం నాగేందర్‌పై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని, ఈసారి ఓటింగ్ శాతం కూడా పెరుగుతుందని అన్నారు. డబ్బులు ఇచ్చినా ప్రజలు కాంగ్రెస్‌కు ఓటు వేయరని వ్యాఖ్యానించారు. అసెంబ్లీ నుంచి తమ పార్టీ ఎమ్మెల్యేలను సస్పెండ్ చేయడాన్ని కూడా తలసాని తప్పుబట్టారు. సభలో తాము చేయని దానికి, బయట జరిగిన వివాదానికి స్పీకర్‌కు ఏం సంబంధమని ఆయన ప్రశ్నించారు.

ఉక్రెయిన్ వార్‌ను ఆపే మంచి ఆలోచనలు మోదీ వద్ద ఉన్నాయి

మొదటిపేజీ తరువాయి...

వల్దాయి ఇంటర్నేషనల్ డిస్కషన్ క్లబ్ మీటింగ్ సమయంలో పుతిన్ మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. యుద్ధాలను ఆపడంలో మోదీ వ్యూహం ప్రత్యేకమైందని, ప్రపంచ నేతల్లో ఆయన ఒకరు అని, ఆయనతో మంచి సంబంధాలు ఉన్నాయని, స్నేహపూర్వక సంబంధా లు ఉన్నాయని, వ్యక్తిగతంగానూ మంచి రిలేషన్ ఉందని, ఎక్కడ కలిసినా ప్రతిసారి ఉక్రెయిన్ యుద్ధం ముగింపు గురించి అడుగుతుం టారని పుతిన్ అన్నారు. ఉమ్మడిగా అంగీకరం కుదుర్చుకునే ఐడియాలు ఆయన వద్ద చాలా ఉన్నాయని తెలిపారు. ఢిల్లీలో జరిగిన బ్రిక్స్ సమావేశాల సమయంలోనూ ఉక్రెయిన్ వార్ గురించి మోదీ అడిగారన్నారు. ఇండియా చేపట్టే శాంతి ప్రయత్నాలను స్వాగతిస్తామని క్రెమ్లిన్ ప్రతినిధి దిమిత్రీ పిస్కోవ్ తెలిపారు. చర్చలు, దౌత్యంతో ఉక్రెయిన్ సంక్షోభాన్ని పరిష్కరించాలని భారత్ చేస్తున్న సూచనలను తాము కూడా అంగీకరిస్తున్నట్లు దిమిత్రీ వెల్లడించారు.

శాంతియుత పోరాటాల ద్వారా సామాజిక మార్పు సాధించడమే గాంధీజీ ఆశయం

మొదటిపేజీ తరువాయి...

గాంధీ జయంతి సందర్భంగా దేశ స్వాతంత్ర్యం కోసం వారి త్యాగనిరతని స్మరించుకుంటూ ఆ మహనీయునికి ఘన నివాళులు అర్పించారు. న్యాయమైన ప్రజల ఆకాంక్షల కోసం, నిరంకుశ ప్రభుత్వాల మీద పోరాడే నాయకత్వం, విశాల దృక్పథంతో తమ పోరాట కార్యాచరణను రూపొందించుకోవాలనే తాత్వికతను గాంధీజీ జీవితం నుంచి నేర్చుకోవాల్సి ఉన్నదని కేసీఆర్ అన్నారు. పీడితులందరినీ సమస్వయం చేసుకుంటూ, భావజాల వ్యాప్తిని చేస్తూ, శాంతియుత పోరాటంలో భిన్న వర్గాలను ఐక్యసంఘటన శక్తిగా తీర్చిదిద్దుకోవాలనే గాంధీజీ ఆశయాలను ప్రతీ ఒక్కరు అనుసరించాలన్నారు. తెలంగాణ సాధన కోసం తాను ఒంటరిగా ముందడుగు వేసిన నాటినుంచి నేటి వరకు ఎన్ని కష్టాలొచ్చినా తాను స్థిత ప్రజ్ఞతో అనుసరిస్తున్న కార్యాచరణలో గాంధీజీ స్ఫూర్తి ఇమిడి ఉన్నదని కేసీఆర్ స్పష్టం చేశారు. విద్వేష పూరిత ప్రసంగాలను, కక్షపూరిత వైఖరులను విడనాడి, ప్రజల నడుమ శాంతి సౌభ్రాతృత్వం పరిఢవిల్లేలా పాలనను కొనసాగించడం ద్వారా మాత్రమే జాతిపిత మహాత్మాగాంధీకి మనం నిజమైన నివాళులు అర్పించిన వారమవుతామని కేసీఆర్ పునరుద్ఘాటించారు.

జనకాపూర్ జైలును సందర్శించిన జిల్లా కలెక్టర్



జననినాదం,ఆసిఫాబాద్జిల్లా ప్రతినిధి అక్టోబర్ 02: గాంధీ జయంతి సందర్భంగా శుక్రవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి అనూష, అదనపు ఎస్పీ చిత్తరంజన్, జైలర్ ప్రవీణ్ తో కలిసి జిల్లా కేంద్రంలోని జనకాపూర్ జైలును కలెక్టర్ కె. హరిత నందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సద్ప్రవర్తనతో జరిగిపోయిన తప్పుల గురించి ఆలోచించకుండా భవిష్యత్తుపై దృష్టి పెట్టాలని ఖైదీలకు సూచించారు. జైలులో ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకుని, సద్ప్రవర్తనతో మెలగడం వల్ల నమాజంలో, కుటుంబంలో మళ్లీ గౌరవప్రదమైన జీవితాన్ని ప్రారంభించవచ్చని అన్నారు.జైలులో అందిస్తున్న వివిధ రకాల ఉపాధి శిక్షణ కార్యక్రమాలను ఖైదీలు ఉపయోగించుకోవాలని, బయటకు వెళ్లిన తర్వాత అవి ఉపయోగపడతాయని తెలిపారు.పూర్వకాలంలా కాకుండా ప్రస్తుత జైళ్లలో ఖైదీలకు అవసరమైన ప్రాథమిక వసతులు, గాలి, నీరు, వెలుతురు, పౌష్టిక ఆహారం, ఆరోగ్య సంరక్షణ మరియు మెరుగైన సౌకర్యాలు సమకూరుస్తున్నామని అన్నారు.విద్యార్హతలు పెంపొందించుకునే, చదువుకోవాలనే ఆసక్తి ఉన్న ఖైదీల కోసం ఓపెన్ స్కూలింగ్ మరియు దూరవిద్య, ఓపెన్ యూనివర్సిటీ కోర్సుల ద్వారా ఉన్నత చదువులు పూర్తి చేసే అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు.ఖైదీలు ఈ వాతావరణాన్ని సానుకూలంగా మార్చుకుని సన్మార్గంలో పయనించాలని సూచించారు. కలెక్టర్ ఖైదీలకు గాంధీ జయంతి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది, ఖైదీలు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు నగదు రహిత వైద్యం కల్పించాలి

ప్రత్యేక కేంద్ర చట్టం తేవాలి.. వేజ్ బోర్డు ఏర్పాటు చేయాలి
టీయూడబ్ల్యూజే--ఐజేయూ, టీయూడబ్ల్యూజే--143 నాయకుల డిమాండ్



జననినాదం,ఆసిఫాబాద్జిల్లా ప్రతినిధి అక్టోబర్ 02: జర్నలిస్టుల రక్షణకు ప్రత్యేక కేంద్ర చట్టం తీసుకురావడంతో పాటు వారికి, వారి కుటుంబ సభ్యులకు నగదు రహిత వైద్య సేవలు అందించే ఆరోగ్య కార్డులను వెంటనే జారీ చేయాలని టీయూడబ్ల్యూజే--ఐజేయూ, టీయూడబ్ల్యూజే--143 నాయకులు డిమాండ్ చేశారు. జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం జిల్లా కేంద్రంలో ఆయా సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు.
టీయూడబ్ల్యూజే--ఐజేయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జర్నలిస్టు డిమాండ్స్ డేలో భాగంగా అంబేద్కర్ చౌక్ నుంచి వివేకానంద చౌక్ మీదుగా గాంధీ చౌక్ వరకు జర్నలిస్టులు భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం గాంధీ చౌక్‌లో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్, ప్రధాన కార్యదర్శి సంపత్‌కుమార్ మాట్లాడుతూ జర్నలిస్టులకు రోజురోజుకూ రక్షణ లేకుండా పోతోందన్నారు. విధి నిర్వహణలో ఎదురవుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక రక్షణ చట్టం తీసుకురావాలని కోరారు.జర్నలిస్టులు చాలీచాలని వేతనాలతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే నూతన వేజ్ బోర్డును ఏర్పాటు చేయాలని, కొత్త లేబర్ కోడ్‌లతో రద్దయిన వర్కింగ్ జర్నలిస్టుల చట్టబద్ధ హక్కులను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు అర్హులైన జర్నలిస్టులకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు కేటాయించాలని, ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో నగదు రహిత వైద్య సేవలు అందించే హెల్త్ కార్డులు జారీ చేయాలని కోరారు.ఇదే అంశంపై టీయూడబ్ల్యూజే--143 ఆధ్వర్యంలో గాంధీ చౌక్‌లో మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జర్నలిస్టుల డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించి నిరసన తెలిపారు. జిల్లా కన్వీనర్ రవినాయక్ మాట్లాడుతూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో జర్నలిస్టులు నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. విధి నిర్వహణలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న జర్నలిస్టులకు ఆరోగ్య భద్రత కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. జర్నలిస్టులతో పాటు వారి కుటుంబ సభ్యులకు నగదు రహిత వైద్య సేవలు అందేలా తక్షణ చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రిని కోరారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని, సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లేందుకు జర్నలిస్టులంతా పోస్టుకార్డు ఉద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.కార్యక్రమాల్లో జిల్లా అక్రిడేషన్ కమిటీ సభ్యుడు ప్రకాష్‌గౌడ్, టీయూడబ్ల్యూజే జిల్లా కోశాధికారి అడపా సతీష్, ఉపాధ్యక్షులు కృష్ణంరాజు, చంద్రకాంత్, నవీన్‌గౌడ్, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు ఎస్.వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి వారణాసి శ్రీనివాస్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు రాజు, ప్రధాన కార్యదర్శి సదాశివ్, సీనియర్ జర్నలిస్టులు దీకొండ సతీష్, చిప్ప సురేష్, రామస్వామి, చందు, సంతోష్, ఇర్ఫాన్, రాందాస్, వెంకటేష్, అశోక్, రవీందర్, రాజేష్, నరేష్, ముబాషీర్‌తో పాటు వలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సురక్షిత తాగునీరు

వంద శాతం కనెక్షన్ల సద్వినియోగం చేసుకోవాలి: కలెక్టర్ హరిత





జననినాదం,ఆసిఫాబాద్జిల్లా ప్రతినిధి అక్టోబర్ 02: హర్ ఘర్ జల్--జల్ జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికీ సురక్షితమైన, నాణ్యమైన తాగునీటిని అందించడమే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ కె. హరిత అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా శుక్రవారం మండలంలోని గోవింద్‌పూర్ గ్రామపంచాయతీలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. గ్రామంలో వంద శాతం మంచినీటి కనెక్షన్లు సాధించడంపై గ్రామస్థులను అభినందించారు.మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ తాగునీటి సరఫరా కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని కలెక్టర్ తెలిపారు. గోవింద్‌పూర్‌లో వంద శాతం మంచినీటి కనెక్షన్లు సాధించడం గ్రామస్థుల సహకారం, సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో సాధ్యమైందన్నారు. ప్రతి ఇంటికీ అందుబాటులోకి వచ్చిన కనెక్షన్లను సద్వినియోగం చేసుకోవడంతోపాటు నీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించాలని సూచించారు.
పైపులైన్లు, నల్లాల్లో చిన్నపాటి మరమ్మతులు ఏర్పడిన వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి నీటి వృథాను అరికట్టాలని కోరారు. గ్రామంలోని నీటి వనరులను సంరక్షించడం, ప్రజా వనరులను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు.గాంధీ జయంతి సందర్భంగా గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడం, పరిసరాలను స్వచ్ఛంగా ఉంచుకోవడం, నీటిని పొదుపుగా వినియోగించడం తదితర అంశాలపై ప్రజలు, చిన్నారులకు అవగాహన కల్పించారు. పరిశుభ్రత, సామాజిక బాధ్యత విషయంలో మహాత్మాగాంధీ చూపిన మార్గాన్ని ప్రతి ఒక్కరూ పాటించాలని కలెక్టర్ సూచించారు. నీటి సంరక్షణ, పరిశుభ్రతపై చిన్నారులు తమ కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించాలని కోరారు. గ్రామంలో తాగునీటి సరఫరాకు సంబంధించి ఏవైనా సమస్యలు తలెత్తితే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని, ప్రజల సమస్యల పరిష్కారానికి జిల్లా యంత్రాంగం అందుబాటులో ఉంటుందని తెలిపారు.కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మట్, డివ్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌టిఐ కమిటీ సభ్యుల నియామకానికి దరఖాస్తుల స్వీకరణ



జననినాదం,మంచిర్యాల ప్రతినిధి అక్టోబర్ 02: సమాచార హక్కు చట్టం--2005ను జిల్లాలో సమర్థవంతంగా అమలు చేయడం, సమాచార హక్కు చట్టం అమలుకు సంబంధించి జిల్లా స్థాయిలో సమన్వయం, పర్యవేక్షణ, అమలు ప్రక్రియను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు జిల్లా స్థాయి సమన్వయ కమిటీని ఏర్పాటు చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కమిటీలో ఇద్దరు ఆర్‌టిఐ కార్యకర్తలను నామినేషన్ రోటేషన్ పద్ధతిలో సభ్యులుగా ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లాకు చెందిన ఆసక్తి, అర్హత కలిగిన ఆర్‌టిఐ కార్యకర్తలు జిల్లా స్థాయి సమన్వయ కమిటీలో సభ్యులుగా సేవలందించేందుకు తమ దరఖాస్తులను ప్రజా సమాచార అధికారి / జిల్లా రెవెన్యూ అధికారి, జిల్లా కలెక్టర్ కార్యాలయం, మంచిర్యాలలో ఈ నెల 6వ తేదీ లోగా వ్యక్తిగతంగా సమర్పించవలసి ఉంటుందని తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాలు, సూచనలకు అనుగుణంగా ఇద్దరు ఆర్‌టిఐ కార్యకర్తలను కమిటీ సభ్యులుగా నామినేట్ చేయడం జరుగుతుందని, జిల్లాలోని ఆర్‌టిఐ కార్యకర్తలు ఈ అవకాశాన్ని వినియోగించుకొని నిర్ణీత గడువులోగా తమ దరఖాస్తులను సమర్పించాలని తెలిపారు.

గాంధీ చూపిన సత్యం, అహింస, శాంతి మార్గాలు ఆచరణీయం

జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య



జననినాదం,మంచిర్యాల ప్రతినిధి అక్టోబర్ 02: జాతిపిత మహాత్మాగాంధీ చూపిన సత్యం, అహింస, శాంతి మార్గాలు ఆచరణీయమని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. శుక్రవారం మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకొని జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన వేడుకలకు జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు, జిల్లా రెవెన్యూ అధికారి మోతిరామ్, వివిధ శాఖల జిల్లా అధికారులతో కలిసి హాజరై మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య సాధనలో మహాత్మా గాంధీ కీలక పాత్ర పోషించారని, సత్యం, అహింస, శాంతి, సత్యాగ్రహం వంటి ఆచరణీయ సిద్ధాంతాలను అనుసరించి స్వతంత్రాన్ని సాధించారని తెలిపారు. మహాత్మా గాంధీ చూపిన అహింసా మార్గం, సత్యనిష్ఠ, నిరాడంబర జీవనం, దేశ సేవా స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శనీయమని తెలిపారు. సమాజంలో శాంతి, సామరస్యం, సోదరభావం పెంపొందించడంతో పాటు ప్రజాసేవలో నిజాయితీ, బాధ్యత, పారదర్శకత వంటి విలువలను పాటించాలని, గాంధీజీ కలలు కన్న స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన, సమానత్వం కలిగిన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గంజాయి సాగుపై ఉక్కుపాదం

సోన్పల్లిలో రూ.9.80 లక్షల విలువ చేసే 98 మొక్కలు స్వాధీనం
నిందితుడిపై ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు



జననినాదం,సిరికొండ 02: గంజాయి అక్రమ సాగుపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. ఇచ్చోడ రూరల్ సీఐ సీహెచ్. రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. సోన్పల్లి గ్రామానికి చెందిన తోడసం ముయ్య (78) ఇంటి ముందు గంజాయి మొక్కలు సాగు చేస్తున్నట్లు సమాచారం అందడంతో సిరికొండ ఎస్సై విక్రమ్ ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా 98 గంజాయి మొక్కలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.9.80 లక్షలు ఉంటుందని తెలిపారు. గంజాయిని సేవించడంతో పాటు విక్రయించి డబ్బులు సంపాదించేందుకు సాగు చేస్తున్నట్లు విచారణలో నిందితుడు వెల్లడించినట్లు సీఐ పేర్కొన్నారు. నిందితుడిపై ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సాగు చేస్తే పథకాలకు దూరం...

గంజాయి పండించినా, రవాణా చేసినా, విక్రయించినా, సేవించినా చట్టపరమైన చర్యలు తప్పవని సీఐ రమేష్ హెచ్చరించారు. గంజాయి సాగు చేసే రైతులకు ప్రభుత్వ పథకాలు వర్తించకుండా సిఫార్సు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు 150 ఎకరాల్లో గంజాయి సాగును గుర్తించి ప్రభుత్వ పథకాలు వర్తించకుండా చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు.

గ్రామ పంచాయతీ కార్మికులకు ఘన సన్మానం

అనార్‌పల్లి గ్రామ సభలో గాంధీ జయంతి వేడుకలు



జననినాదం,సిర్పూర్(యు),కెరమెరి అక్టోబర్ 02: గాంధీ జయంతిని పురస్కరించుకుని అనార్‌పల్లి గ్రామంలో గ్రామ సభను ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ జాతోత్ శారద ఉమేష్ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్మికులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణ, గ్రామ పరిశుభ్రత కోసం నిరంతరం సేవలందిస్తున్న కార్మికులను శాలువాలతో సత్కరించి అభినందించారు.గ్రామ పరిశుభ్రతను కాపాడటంలో పంచాయతీ కార్మికుల పాత్ర ఎంతో కీలకమని సర్పంచ్ శారద ఉమేష్ నాయక్ పేర్కొన్నారు. మహాత్మాగాంధీ ఆశయాల్లో పరిశుభ్రతకు ప్రత్యేక స్థానం ఉందని, ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. గ్రామంలో పారిశుద్ధ్య కార్యక్రమాలను నిరంతరం కొనసాగించేందుకు పంచాయతీ తరఫున అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు.
అనంతరం గ్రామ సభలో గ్రామ అభివృద్ధి, పారిశుద్ధ్యం తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది, కార్మికులు, గ్రామ పెద్దలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం సందర్భంగా సన్మానం పొందిన పంచాయతీ కార్మికులు సంతోషం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తరుణ్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

వన్యప్రాణులు ఉంటేనే అడవులకు అందం

అటవీ క్షేత్రాధికారి కే. రమాదేవి
వారోత్సవాల్లో భాగంగా వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు



జననినాదం,తిర్యాణి 02: వన్యప్రాణులు ఉంటేనే అడవులకు అందం, ప్రకృతికి సమతుల్యత చేకూరుతుందని అటవీ క్షేత్రాధికారి కే. రమాదేవి అన్నారు. జాతీయ వన్యప్రాణుల వారోత్సవాలను పురస్కరించుకుని తిర్యాణి మండలంలోని ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలలో అటవీ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అడవులు, వన్యప్రాణులు ప్రకృతి వ్యవస్థలో పరస్పరం ఆధారపడి ఉంటాయని, వన్యప్రాణుల సంఖ్య తగ్గితే పర్యావరణ సమతుల్యత దెబ్బతినే అవకాశం ఉందన్నారు. అందుకే అడవులను కాపాడటంతో పాటు వన్యప్రాణుల సంరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. విద్యార్థుల్లో చిన్ననాటి నుంచే పర్యావరణం, అడవులు, వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన పెంచాలనే ఉద్దేశంతో వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించినట్లు ఆమె తెలిపారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని వన్యప్రాణుల పరిరక్షణను ప్రతిబింబించే చిత్రాలను గీసి తమ ప్రతిభను చాటుకున్నారని పేర్కొన్నారు. పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఈ నెల 8న వన్యప్రాణుల వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, అటవీ శాఖ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

చోర్‌పల్లి సర్పంచ్ మర్సుకోలా అనసూయ జూగాదిరావు

చోర్‌పల్లిలో గాంధీ జయంతి.. గ్రామసభ



జననినాదం,సిర్పూర్(యు),లింగాపూర్ అక్టోబర్ 30: ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామాభివృద్ధి సాధ్యమని చోర్‌పల్లి సర్పంచ్ మర్సుకోలా అనసూయ జూగాదిరావు అన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో వేడుకలతో పాటు గ్రామసభ నిర్వహించారు. ముందుగా గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.
అనంతరం జరిగిన గ్రామసభలో ఉపాధి హామీ పథకం పనుల ప్రణాళిక, అమలుపై చర్చించారు. గ్రామంలో అవసరమైన పనులను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో చేపట్టాలని నిర్ణయించారు. కూలీలకు ఉపాధి అవకాశాలు కల్పించడం, గ్రామాభివృద్ధి, పరిశుభ్రత, సంక్షేమ పథకాలు, ప్రజా సమస్యల పరిష్కారం తదితర అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామ పటేల్, దేవరీలు, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రామ అవసరాలకు అనుగుణంగా పనుల నిర్వహణ

జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య



జననినాదం,మంచిర్యాల ప్రతినిధిఅక్టోబర్ 02: గ్రామ అవసరాలకు అనుగుణంగా పనులు గుర్తించి చేపట్టేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు.. శుక్రవారం జిల్లాలోని జైపూర్ మండలం టేకుమట్ల గ్రామంలో స్వచ్ఛత హి సేవ లో భాగంగా ఏర్పాటుచేసిన గ్రామ సభకు మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీపతి బాపు, అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఈ గ్రామసభలలో గ్రామాభివృద్ధి, ఉపాధి హామీ పనుల ప్రణాళిక, గ్రామానికి అవసరమైన మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై చర్చించి కార్యాచరణ రూపొందించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. వీబీ–జీ రామ్ జీ వధకానికి సంబంధించిన నూతన మార్గదర్శకాలు, ఉపాధి హామీ పనుల ప్రణాళిక, గ్రామ అవసరాలకు అనుగుణంగా పనుల ఎంపిక జరుగుతుందని తెలిపారు. గ్రామ పంచాయతీల పరిధిలోని ప్రతి జాబ్‌కార్డు కలిగిన కుటుంబానికి ఉపాధి కల్పించడంతో పాటు గ్రామాల అభివృద్ధికి ఉపయోగపడే పనులను ప్రాధాన్యతతో చేవట్టాలని అధికారులకు సూచించారు. గతంలో ఉపాధి హామీ పథకంగా అమలైన కార్యక్రమం ప్రస్తుతం వీబీ–జీ రామ్‌జీ పథకం కింద అమలవుతోందని తెలిపారు. గ్రామసభలో స్థానిక అవసరాలకు అనుగుణంగా వనులను గుర్తించి వనుల నిర్వహణకు అవసరమైన తీర్మానం చేయాలని తెలిపారు. వర్షాభావ పరిస్థితులు, నీటి కొరతను దృష్టిలో ఉంచుకొని వాటర్ హార్వెస్టింగ్, చెక్‌డ్యామ్‌లు, ఫీడర్ ఛానళ్ల శుభ్రత, ఇంకుడు గుంతలు, బోర్‌వెల్ రీచార్జ్ నిర్మాణాలు, రూఫ్‌టాప్ వాటర్ హార్వెస్టింగ్ వంటి పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. ప్రతి ప్రభుత్వ భవనం వద్ద వర్షపు నీటిని సంరక్షించే నిర్మాణాలు ఏర్పాటు చేయాలని సూచించారు. గ్రామాలలోని ప్రతి ఇంటికి ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసి, ఇంటి నుంచి వెలువడే వాడుక నీటిని భూమిలోకి ఇంకేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. గ్రామాల పారిశుద్ధ్యంతో పాటు భూగర్భ జలాల పెంపునకు దోహదపడుతుందని వివరించారు. జాబ్‌కార్డు కలిగిన కూలీలకు నిరంతరం ఉపాధి కల్పించడం ద్వారా గ్రామీణ కుటుంబాలకు ఆదాయం లభించడంతో పాటు గ్రామ పంచాయతీలకు మెటీరియల్ కాంపోనెంట్ నిధులు సమకూరుతాయని, నిధులను గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధికి వినియోగించుకోవాలని సూచించారు. గ్రామీణ ఉపాధి, నీటి సంరక్షణ, పారిశుద్ధ్యం, జీవనోపాధి మౌలిక వసతుల అభివృద్ధికి గ్రామసభల ద్వారా సమగ్ర కార్యాచరణ రూపొందించాలని అధికారులకు సూచించారు. గ్రామంలోని అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించి పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలపై ప్రత్యేక దృష్టి సారించాలని, పిల్లల ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరు తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలని తెలిపారు.అనంతరం వేలాల గ్రామ సమీపంలోని గోదావరి నది తీరంలో పుష్కర ఘాట్ ఏర్పాటు పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. గోదావరి పుష్కరాలు 2027 ఏర్పాట్లకు సంబంధించి క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించారు. సుమారు 14.30 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న గోదావరి పుష్కర ఘాట్, సుమారు 3 ఎకరాల విస్తీర్ణంలో చేపట్టే అభివృద్ధి పనులు, సి సి రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదించిన ప్రాంతాలను పరిశీలించారు. పుష్కరాల సందర్భంగా భక్తులకు అవసరమైన మౌలిక వసతులు, రహదారులు, పారిశుద్ధ్యం, త్రాగునీరు తదితర సౌకర్యాల కల్పనకు సంబంధించి అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. వి బి జి రామ్ జి పథకంలో గుర్తించిన 375 రకాల పనులలో గ్రామానికి అవసరమైన పనులను గ్రామసభ ద్వారా గుర్తించి ప్రాధాన్యత క్రమంలో చేవట్టాలని సూచించారు. గ్రామ అవసరాలకు అనుగుణంగా పనుల ప్రణాళిక రూపొందించాలని, ఉపాధి కల్పనతో పాటు గ్రామంలో శాశ్వత సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. ప్రస్తుత వర్షాకాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని జల సంరక్షణ, నీటి నిల్వలు, నీటి వనరుల అభివృద్ధికి సంబంధించిన పనులను గుర్తించి చేపట్టాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్లు, పెన్షన్లు, ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా సంబంధిత అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. గ్రామంలోని గట్టు మల్లన్న స్వామి ఆలయాన్ని సందర్శించి స్వామిని దర్శించుకున్నారు. పుష్కరాల ఏర్పాట్లలో భాగంగా ఆలయ అభివృద్ధికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఇందుకుగాను అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో టేకుమట్ల, వేలాల సర్పంచ్ లు బల్ల వెంకటేష్, డేగ స్వప్న, గ్రామీణ నీటి సరఫరా, పంచాయతీరాజ్ అధికారులు, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులుపాల్గోన్నారు.



కుల వివక్షపై ఉద్య మాలను ఉధృతం చేస్తాం

కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దిన్ కర్



జననినాదం,ఆసిఫాబాద్జిల్లా ప్రతినిధి అక్టోబర్ 02: కుల వివక్షకు వ్యతిరేకంగా, దళితులు, గిరిజనులు, పేదల హక్కుల సాధన కోసం జిల్లా వ్యాప్తంగా ఉద్యమాలను ఉధృతం చేస్తామని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్ తెలిపారు. కెవిపిఎస్ 29వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని ప్రజా సంఘాల కార్యాలయంలో శుక్రవారం జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించి, నిధులు పెంచాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కోట శ్రీనివాస్, దుర్గం పవన్‌కుమార్, నాయకులు పస్తం ఆనంద్‌రావు, ఇప్ప ప్రసాద్, శేఖర్, భాస్కర్, ప్రశాంత్, సామిల్, నితిన్, డీవైఎఫ్ఐ నాయకులు గేడం టీకానంద్, దుర్గం రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వార్తను మరింత సంక్షిప్తంగా మార్చండి
ప్రదేశం, తేదీని ఏకరీతిగా సరిచేయండి

ఘనంగా గాంధీ జయంతి వేడుకలు



జననినాదం,సిర్పూర్(యు),కెరమెరి అక్టోబర్ 02: మహాత్మాగాంధీ 157వ జయంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మొహమ్మద్ సుజాయిత్ ఖాన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం బస్టాండ్‌లోని మహాత్మాగాంధీ, జ్యోతిరావు ఫూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా మొహమ్మద్ సుజాయిత్ ఖాన్ మాట్లాడుతూ.. మహాత్మాగాంధీ దేశానికి చూపిన సత్యం, అహింస, శాంతి మార్గాలు నేటికీ నూర్పిర్తిదాయకమని అన్నారు. గాంధీజీ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని, యువత ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. అదేవిధంగా సామాజిక సమానత్వం, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం జ్యోతిరావు ఫూలే చేసిన సేవలను స్మరించుకోవాలని పేర్కొన్నారు.దేశ స్వాతంత్ర్యం కోసం గాంధీజీ చేసిన పోరాటం, త్యాగాలను నేటి తరానికి తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. గాంధీజీ కలలు కన్న స్వచ్ఛమైన, సమానత్వ సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఇందిరా ఫెలోషిప్ జిల్లా అధ్యక్షురాలు కోవ ఇందిరా, మాజీ సర్పంచ్ జగన్నాథ్ రావు, సీనియర్ నాయకులు మొహర్లే బాపురావు, రాథోడ్ శంకర్ నాయక్, గిడ్డప్ప, గోగర్ల రాజయ్య, దేవిదాస్, ప్రకాష్, అనుముల అనిల్, మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

గాంధీ పేరుతో ఉన్న ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలి

డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క

మహాత్మా గాంధీ జయంతి వేడుకలను జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క, నియోజకవర్గ ఇన్‌ఛార్జి అజ్మీరా శ్యాంనాయక్, మాజీ డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్‌కుమార్ తదితరులు గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆత్రం సుగుణక్క మాట్లాడుతూ.. సత్యం, అహింస, శాంతి మార్గాలను గాంధీజీ దేశానికి చూపించారని అన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు.మహాత్మా గాంధీ పేరుతో కొనసాగుతున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసి కొత్త చట్టాన్ని తీసుకురావడం ద్వారా కేంద్ర ప్రభుత్వం గాంధీజీ పేరును తొలగించడంతో పాటు గ్రామీణ పేదల ఉపాధి హక్కును బలహీనపరిచే ప్రయత్నం చేస్తోందని ఆమె విమర్శించారు. పని కోరిన గ్రామీణ కూలీలకు ఉపాధి కల్పించే హక్కు ఆధారిత వ్యవస్థను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర కేటాయింపులపై ఆధారపడే విధానం పేదలకు నష్టం కలిగించే అవకాశం ఉందని పేర్కొన్నారు.గాంధీజీ పేరుతో ఉన్న ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించాలని, ఆయన పేరును కొనసాగించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామీణ కూలీలు, పేద కుటుంబాలకు ఉపాధి భరోసా కల్పించే చట్టాన్ని మరింత బలోపేతం చేయాలని కోరారు. రాష్ట్రాలపై అదనపు ఆర్థిక భారం పడకుండా కేంద్రం తన బాధ్యతను నిర్వర్తించాలని అన్నారు. గాంధీజీ ఆశయాలను కాపాడుతూ గ్రామీణ పేదల హక్కుల కోసం కాంగ్రెస్ పార్టీ పోరాడుతుందని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఇరుకుల మంగ, మాజీ ఎంపీపీ బాలేష్‌గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వైరాగడ్ మారుతిపటేల్, విశ్వనాథ్, డీసీసీ ఉపాధ్యక్షుడు భీమారావు, ఎస్సీ సెల్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి జడి ప్రసాద్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాపర్తి మురళి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇమ్రాన్, దుర్గం రవినాయక్, రమేష్, అనుమాండ్ల సాయి, దత్తు, నాగేష్, శంకర్‌పటేల్, వినోద్, గురుమూర్తి, సంతోష్, సిడం తిరుపతి, రాము, యూత్ కాంగ్రెస్ నాయకులు సాయి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో అండగా నిలవడమే మానవత్వం

ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు పుల్లూరి శ్యామ్



జననినాదం, తిర్యాణి 02: ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలిచి వారికి భరోసా కల్పించడమే మానవత్వమని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు పుల్లూరి శ్యామ్ అన్నారు. కన్నేపల్లి గ్రామపంచాయతీకి చెందిన అక్కేపల్లి రమేష్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో శుక్రవారం ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి 25 కిలోల బియ్యంతో పాటు ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబ పెద్దను కోల్పోయి కష్టాల్లో ఉన్న వారికి మనకు తోచిన విధంగా అండగా నిలవాలన్నారు. బాధిత కుటుంబం కష్టాల్లో ఉన్న సమయంలో తోడుగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతగా భావించాలన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు తమవంతు సహాయాన్ని అందిస్తామని తెలిపారు. ఆపదలో ఉన్న కుటుంబాలకు ఎమ్మార్పీఎస్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పేర్కొన్నారు.

గాంధీ జయంతి సందర్భంగా సిర్పూర్(యు)లో గ్రామంలో వివిజి రామ్ జీ పనులపై గ్రామసభ



జననినాదం,సిర్పూర్(యు), అక్టోబర్ 02: సిర్పూర్(యు) మండలకేంద్రంలో గాంధీ ఘనంగా నివాళిఅర్పించారు. మాజీ మార్కెట్‌కమిటిచైర్మన్ ఆత్రం భగవంత్‌రావు మాట్లాడాతు గాంధీ గొప్పతనాన్ని, సత్యం, అహింస మార్గాల ద్వారా వారు దేశానికి చేసిన ఎనలేని కృషిని వివరించారు. వారి ఆలోచనలు, వారి ప్రవచనాలు నేటి సమాజానికి ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని, నేటి పరిస్థితుల్లో వారి సిద్ధాంతాలు విశ్వశాంతికి ఎంతో ఉపయోగపడతాయని తెలియజేశారు.మండలంలోని 15 గ్రామ పంచాయతీలలో గాంధీ జయంతి సందర్భంగా వివిజి రామ్ జీ (మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం) పనులపై గ్రామసభ నిర్వహించారు.సర్పంచ్ ఆత్రం ఓంప్రకాష్, గ్రామపంచాయతీ కార్యదర్శి అవినాష్. తోపాటు ఫీల్డ్ అసిస్టెంట్ రాటోడ్ దశత్ ఆధ్వర్యంలో కూలీలతో ఈ గ్రామసభ జరిగింది. ఈ సందర్భంగా గతంలో చేపట్టిన పనులు, ప్రస్తుతం జరుగుతున్న పనులు, రాబోయే కార్యాచరణ ప్రణాళికపై విన్నతంగా చర్చించారు.గ్రామసభలో కూలీలకు పలు సూచనలు చేశారు. ఎండ తీవ్రత నేపథ్యంలో పనుల సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని, తరచుగా నీరు, ఓఆర్ఎస్ తాగాలని, ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. మేట్స్ ద్వారా నమోదు చేసిన పనులకు ఎంత కూలీ డబ్బు వస్తుందనే విషయంపై కూలీలకు స్పష్టత ఇచ్చారు. ఇప్పటి వరకు జరిగిన పనులకు సంబంధించి అందరికీ కూలీ డబ్బులు జమ అయ్యాయా లేదా అని ఆరా తీశారు. పెండింగ్ లో ఉన్న వారి వివరాలు సేకరించి వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.అలాగే ప్రతి కూలీ తమ బ్యాంకు ఖాతాకు ఆధార్ లింక్, కేవైసీ తప్పనిసరిగా చేసుకోవాలని, లేనిపక్షంలో కూలీ డబ్బులు జమ కావడంలో జాప్యం జరుగుతుందని వివరించారు. జాబ్ కార్డులు, మస్టర్ రోల్ నిర్వహణ, పనుల నాణ్యత పై కూడా అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సినియర్ మెట్స్ ఆత్రం విశ్వంబరావు, ఉపసర్పంచ్ పెందోర్ రాము, ఆశా వర్కర్ లక్ష్మీ, ఉపాధి కూలీలు, వార్డ్‌మెంబర్‌లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థుల కడుపు కొట్టొద్దు

ఆశ్రమ పాఠశాలల ఆహార సామగ్రి పక్కదారి పట్టకుండా తనిఖీలు చేపట్టాలి

విద్యార్థి సంఘం మండల ఉపాధ్యక్షుడు రాయి సీడం గంగు



జననినాదం,తిర్యాణి 02: ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న గిరిజన విద్యార్థుల కోసం ప్రభుత్వం అందిస్తున్న బియ్యం, ఆహార సామగ్రిని పక్కదారి పట్టించి వారి కడుపు కొట్టొద్దని విద్యార్థి సంఘం మండల ఉపాధ్యక్షుడు రాయి సీడం గంగు అన్నారు. శుక్రవారం తిర్యాణి మండల కేంద్రంలో విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. మంచిర్యాల జిల్లా కాసిపేట మండలం రేగులగూడ ఆశ్రమ పాఠశాలలో బియ్యం అక్రమ తరలింపు ఘటన వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో తిర్యాణి మండలంలోని మారుమూల గిరిజన ప్రాంతాల ఆశ్రమ పాఠశాలల్లోనూ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. విద్యార్థుల కోసం కేటాయించిన బియ్యం, నిత్యావసర సరుకులు పక్కదారి పడకుండా తనిఖీలు చేపట్టాలని, కొన్ని పాఠశాలల్లో నాణ్యత లేని బియ్యంతో భోజనం అందిస్తున్నారనే ఫిర్యాదులు తమ దృష్టికి వచ్చాయని, విద్యార్థులకు అందాల్సిన ఆహారంలో అక్రమాలకు పాల్పడితే సహించేది లేదన్నారు. బియ్యం, ఆహార సామగ్రి అక్రమ తరలింపుపై ఆధారాలు సేకరించి ఐటీడీఏ పీవో, జిల్లా కలెక్టర్, కమిషనర్‌లకు ఫిర్యాదు చేస్తామన్నారు. బాధ్యులుగా తేలిన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు అవసరమైతే సస్పెన్షన్ వరకు చర్యలు చేవట్టాలని అధికారులను కోరుతామన్నారు. గిరిజన విద్యార్థుల హక్కులకు భంగం కలిగించే చర్యలకు తావివ్వకూడదని పేర్కొన్నారు. ఈ సమావేశంలో టైగర్ సేన మండల ప్రధాన కార్యదర్శి జుగునక జంగు, మండల అధ్యక్షుడు గణపతిరావు, కోట్నాక రాంషా, రాయి సీడం సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో పోలీస్ కమిషనరేట్‌ల పునర్‌వ్యవస్థీకరణ


కీలక మార్పులు



హైదరాబాద్: జీహెచ్ఎంసీ పునర్వ్యవస్థీకరణ నేపథ్యంలో పోలీసింగ్ వ్యవస్థలో రాష్ట్ర ప్రభుత్వం కీలక మార్పులు చేపట్టింది. హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి, ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్‌ల పరిధులలో జోన్లు,డివిజన్లు, లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్లు, మహిళా పోలీస్ స్టేషన్లు, ట్రాఫిక్ విభాగాల పరిధులను ప్రభుత్వం పునర్వ్యవస్థీకరించింది. 2025 డిసెంబర్‌లో నోటిఫై చేసిన పునర్వ్యవస్థీకరణలోని కొన్నింటిని సవరిస్తూ... హోం శాఖ సెప్టెంబర్ 30న మూడు ఉత్తర్వులను జారీ చేసింది. మెరుగైన పోలీసింగ్ సామర్థ్యం, పర్యవేక్షణ, శాంతిభద్రతల నిర్వహణ దృష్ట్యా ఈ చర్య చేపట్టినట్టుగా ప్రభుత్వం పేర్కొంది. ఈ ఉత్తర్వులలో ఏ ప్రాంతాలు ఏ జోన్, డివిజన్, పోలీస్‌స్టేషన్ పరిధిలోకి వస్తాయో స్పష్టతనిచ్చింది. హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయ డివిజన్‌ను శంషాబాద్ డివిజన్‌గా, చికడపల్లి డివిజన్‌ను కాచిగూడ డివిజన్‌గా, సంతోష్ నగర్ డివిజన్‌ను ఛత్రినాక డివిజన్‌గా మార్పులు చేశారు. ఆర్‌జీఐఏ పోలీస్ స్టేషన్‌ను శంషాబాద్ పోలీస్ స్టేషన్‌గా పేరు మార్చారు. రాజేంద్రనగర్, పహాడీషరీఫ్, మీర్‌పేట పోలీసు స్టేషన్‌లను హైదరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలోకి తెచ్చారు. సికింద్రాబాద్ జోన్, మార్కెట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కొన్ని ప్రాంతాలను మహంకాళి పోలీస్ స్టేషన్ పరిధిలోకి మార్చారు. ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్ మొత్తాన్ని ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలోకి మార్చారు. హైదరాబాద్ సిటీ ట్రాఫిక్ పోలీస్ విభాగంలోనూ పలు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల పరిధులను పునర్వ్యవస్థీకరించారు. వివిధ లా అండ్ ఆర్డర్ పోలీసు స్టేషన్‌లను అనుగుణంగా ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌ల పరిధులను సవరించారు. అలాగే బడంగ్ పేట్ పోలీస్ స్టేషన్‌ను రద్దు చేసి... ఆ పరిధిలోని ప్రాంతాలను ఆదిభట్ల పోలీసు స్టేషన్ పరిధిలో కలిపారు. మహేశ్వరం ప్రాంతంలోని కొన్ని గ్రామాలను పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలోకి, అలాగే శంషాబాద్ ప్రాంతంలోని కొన్ని గ్రామాలను శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోకి మార్చారు. నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలోని కొన్ని ప్రాంతాలను రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్‌లో విలీనం చేశారు. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌కు సంబంధించి ప్రస్తుత పోలీస్ స్టేషన్లు, జోన్లు, డివిజన్ల పరిధిలో ఉన్న పలు కాలనీలు, గ్రామాలను కొత్త పోలీసు స్టేషన్ పరిధుల్లోకి మార్పు చేశారు. సైబరాబాద్ కమిషనరేట్ అమీన్‌పూర్ పరిధిలోని కొన్ని ప్రాంతాల్ని ఐడీఏ బొల్లారం పరిధిలోకి తెచ్చారు. ఇక, మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఉప్పల్ లా అండ్ ఆర్డర్ జోన్‌తో పాటు అల్వాల్ , ఉప్పల్ , మేడిపల్లి లా అండ్ ఆర్డర్ డివిజన్లను కొత్తగా ఏర్పాటు చేశారు. ఉప్పల్ ట్రాఫిక్ డివిజన్‌ను కొత్తగా ఏర్పాటు చేస్తున్నట్టుగా పేర్కొన్నారు. అదే సమయంలో బేగంపేట్ లా అండ్ ఆర్డర్ జోన్‌ను రద్దు చేశారు. కీలక మార్పులు: అల్వాల్ డివిజన్‌ను కొత్తగా ఏర్పాటు చేసి... ఇందులో హైదరాబాద్ సిటీ, సైబరాబాద్ కమిషనరేట్ల పరిధుల్లో ఉన్న కొన్ని ప్రాంతాలను విలీనం చేశారు. ఫ్యూచర్‌సిటీ కమిషనరేట్‌లో ఉన్న మోకిల పోలీసు స్టేషన్ పరిధిలోని జన్వాడ ప్రాంతాన్ని నార్సింగి పోలీసు స్టేషన్ పరిధిలోకి తీసుకొచ్చారు. హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్, ఇబ్రహీంపట్నం పోలీస్ అధికార పరిధిలోని తొర్రూర్, కోహెడ, పెద్దా అంబర్‌పేట్, మంగళ్‌పల్లి గ్రామాలను ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోకి తీసుకొచ్చారు. హైదర్‌షాకోట్, గండం గూడ, బైరాగిగూడ, పిరంచెరువు, తెలంగాణ రాష్ట్ర పోలీస్ అకాడమీ, ఆర్మీ ఫైరింగ్ రేంజ్ ప్రాంతాలు రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోకి వచ్చాయి. తొండుపల్లి, గొల్లపల్లి, పెద్ద గోల్కొండ గ్రామాలను శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోకి చేర్చారు. అన్ని మహిళా పోలీస్ స్టేషన్లు, జోనల్ సైబర్ సెల్స్ వ్యవస్థను జూబ్లీహిల్స్, సికింద్రాబాద్, ఖైరతాబాద్, చార్మినార్, గోల్కొండ, రాజేంద్రనగర్ అనే స్పష్టమైన జోనల్ పరిధులుగా పునర్వ్యవస్థీకరించారు. కుషాయిగూడ, చర్లపల్లి, నాగోల్, తుకారాంగేట్, వనస్థలిపురం పోలీస్ స్టేషన్ల అధికార పరిధులను కూడా మార్చారు.

ఆర్టీసీ బస్సు ఢీ కొని వ్యక్తి మృతి

మెదక్ పట్టణంలో ఘటన



మెదక్ : మెదక్ పట్టణ పరిధిలోని సీడబ్ల్యూసీ గోదాం సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఆర్టీసీ బస్సు, ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో మెదక్ పట్టణానికి చెందిన సద్దాం (40) అక్కడికక్కడే మృతి చెందాడు. సద్దాం కందుర్ కోసం నిత్యావసర వస్తువులు తీసుకు రావడానికి వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఇంటి పెద్ద మృతి చెందడంతో కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. సమాచారం అందుకున్న మెదక్ పట్టణ పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాదానికి కారణమైన ఆర్టీసీ బస్సును మెదక్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

యూనిట్‌కు ఓకే.. రుణానికి నో క్లారిటీ!



మెట్‌పల్లి, మరో సంచలనం: నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించి ఆర్థికంగా అండగా నిలిచేందుకు ప్రభుత్వం చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకం అమలులో జాప్యం జరుగుతోంది. దరఖాస్తులు స్వీకరించి ఏడాది గడుస్తున్నా రుణాలు, రాయితీల ప్రక్రియ ముందుకు సాగకపోవడంతో దరఖాస్తుదారుల్లో నిరాశ నెలకొంది. జగిత్యాల జిల్లాలో వివిధ కార్పొరేషన్ల పరిధిలో 46,258 మంది రుణాల కోసం దరఖాస్తు చేసుకోగా, పరిశీలన అనంతరం 12,905 మందిని యూనిట్ల ఏర్పాటుకు ఎంపిక చేశారు. అయినప్పటికీ రుణాల పంపిణీపై ఇప్పటికీ స్పష్టత లేకపోవడం గమనార్హం.

పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత

చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయొద్దు.. తడి, పొడి చెత్తను వేరు చేయాలి

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి: కలివేరు సర్పంచ్ తెల్లం లక్ష్మణ్



చర్ల, : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని కలివేరు గ్రామ సర్పంచ్ తెల్లం లక్ష్మణ్ అన్నారు. శుక్రవారం చర్ల మండలంలోని కలివేరు గ్రామంలో ఐటీసీ-ఎంఎస్‌కే (బంగారు భవిష్యత్) వారి సహకారంతో మైరాడ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన 'స్వచ్ఛతా హీ సేవ' కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామంలో పారిశుధ్యాన్ని కాపాడేందుకు ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు తమ ఇళ్ల చుట్టుపక్కల పరిసరాలను కూడా ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడం కేవలం ప్రభుత్వ అధికారుల బాధ్యత కాదని, ప్రతి కుటుంబం, ప్రతి పౌరుడు తన వంతు బాధ్యతగా భావించాలని అన్నారు. మొక్కలు నాటితేనే పర్యావరణ పరిరక్షణ: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సర్పంచ్ సూచించారు. చెట్ల పెంపకం వల్ల పర్యావరణ సమతుల్యత కాపాడటం తో పాటు వర్షపాతం మెరుగుపడే అవకాశం ఉంటుందని, తద్వారా వ్యవసాయానికి అనుకూల పరిస్థితులు ఏర్పడి పంటల దిగుబడులు పెరుగుతాయని ప్రజలకు వివరించారు. పర్యావరణాన్ని కాపాడటం అంటే భవిష్యత్ తరాల జీవనానికి భద్రత కల్పించడమేనని పేర్కొన్నారు. తడి, పొడి చెత్తను వేరు చేయాలి: గ్రామ సెక్రటరీ ఇర్పా శ్రీరామ్‌మూర్తి మాట్లాడుతూ తడి, పొడి చెత్తను ఇంటి వద్దనే వేరు చేసి పారిశుధ్య సిబ్బందికి అందించాలని ప్రజలకు అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణానికి తీవ్ర నష్టం కలుగుతుందని, ప్లాస్టిక్ వ్యర్థాలను విచ్చలవిడిగా పడేయకుండా ప్రత్యామ్నాయాలను వినియోగించాలని సూచించారు. పరిశుభ్రమైన గ్రామం కోసం ప్రజలు అధికారులకు సహకరించడంతో పాటు స్వచ్ఛతను నిత్య జీవితంలో భాగంగా మార్చుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మైరాడ సోషల్ మొబిలైజర్లు వి. నవీన్, వి. నాగేశ్వరరావుతో పాటు గ్రామ ప్రజలు టి. బాలకృష్ణ, పీరి నరసింహారావు, ఎన్. బాలకృష్ణ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గుడిబండలో ఘనంగా భూదానం

ఆలయాలకు రెండెకరాల వ్యవసాయ భూమి విరాళం



కోదాడ,అక్టోబర్ 02: సూర్యాపేట జిల్లా కోదాడ మండలం గుడిబండ గ్రామంలో ఒక గొప్ప దాతృత్వ కార్యక్రమం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కీర్తిశేషులు ఎరగాని గాంధీ పుట్టినరోజును పురస్కరించుకుని, ఆయన జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు ఆలయాలకు భారీ భూదానాన్ని ప్రకటించారు.ఎరగాని గాంధీ చివరి కోరిక మేరకు, ఆయన కుమారుడు మరియు కోదాడ టౌన్ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న యారగని రామయ్య ఈ ఉదార నిర్ణయాన్ని తీసుకున్నారు. గుడిబండ గ్రామంలోని శ్రీ సీతారామాంజనేయ స్వామి వారి దేవాలయమునకు ఒక ఎకరం, అలాగే కొత్త గుడిబండ గ్రామంలోని శ్రీ ఆంజనేయ స్వామి వారి దేవాలయమునకు ఒక ఎకరం చొప్పున మొత్తం రెండెకరాల వ్యవసాయ భూమిని విరాళంగా (భూదానం) అందజేశారు.ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధుల సమక్షంలో భూమికి సంబంధించిన పత్రాలను అందజేయడం జరిగింది. గుడిబండ గ్రామ ప్రజల తరఫున దాత యారగని రామయ్యకు, వారి కుటుంబ సభ్యులకు హృదయపూర్వక అభినందనలు మరియు కృతజ్ఞతలు తెలియజేశారు. భగవంతుడు ఆ కుటుంబానికి ఎల్లవేళలా ఆశీస్సులు అందించాలని గ్రామస్తులు కోరుకున్నారు.

టియుడబ్ల్యుజే ఐజేయు మండల అధ్యక్షుడిగా చాపలమడుగు



జూలూరుపాడు/చండ్రుగొండ : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండల టియుడబ్ల్యూజే (ఐజేయు) ఆధ్వర్యంలో స్థానిక ఏవిఆర్ ఫంక్షన్ హాలులో శుక్రవారం సమావేశం ఏర్పాటు చేయడం జరిగినది. ఈ సమావేశంలో మండల నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా చాపలమడుగు నరసింహారావు, ఉపాధ్యక్షులు బాదావత్ హథీరాం, ప్రధాన కార్యదర్శి సంఘం నాగరాజు, సహాయ కార్యదర్శి ఎస్కే బుడెన్ పాషా, కోశాధికారిగా అన్నవరపు జశ్వంత్, ప్రచార కార్యదర్శి రత్నకుమార్, కమిటీ సభ్యులుగా కాసిమల్ల సురేష్, తంబర్ల నరసింహారావు, ఎస్కే సమీర్ ను ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు సిహెచ్ నరసింహారావు మాట్లాడుతూ 70 సంవత్సరాల నుండి ఉన్నటువంటి టియుడబ్ల్యూజే ఐజేయు కమిటీలో మండల అధ్యక్షుడిగా తనను ఎన్నుకోవడం చాలా గౌరవంగా ఉందని ఆయన అన్నారు అదేవిధంగా మండలంలో తమ యూనియన్ లో ఉన్న ప్రతి సభ్యులకి వృత్తిపరంగా ఎటువంటి ఇబ్బందులు వచ్చినా తక్షణమే స్పందిస్తూ కమిటీ సభ్యుల పక్షాన న్యాయం ఉంటే ఎంత దూరమైనా పోరాటానికి సిద్ధంగా ఉంటానని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో. సీనియర్ జర్నలిస్ట్ మిత్రులు. సీనియర్ జర్నలిస్ట్ ప్రెస్ క్లబ్ ప్రెసిడెంట్ కొలిపాక చంద్ర శేఖర్, మోదుగు ప్రభాకర్, మోదుగు ఆదాము, ఐజెయు జిల్లా ఎలక్ట్రానిక్ మీడియాలో సభ్యులు తంబర్ల పుల్లారావు, బాపట్ల మురళి, ఆరెబోయిన కృష్ణ ప్రసాద్, బూరం రమేష్, కంచపోగు నరసింహారావు, మంద లక్ష్మి నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు సమాచారం లేకుండా విధులకు డుమ్మా

ఆకస్మిక తనిఖీల్లో గుర్తించిన కలెక్టర్



హైదరాబాద్ : జిల్లాలో ప్రభుత్వ ఉపాధ్యాయుల గైర్హాజరు పై విద్యాశాఖ ఉక్కుపాదం మోపింది. ముందస్తు సమాచారం లేకుండా, అనధికారికంగా విధులకు డుమ్మా కొట్టిన 183 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులకు హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖాధికారి(డీఈఓ) షోకాజ్ నోటీసులు జారీ చేయడం కలకలం రేపుతోంది. నిబంధనలు ఉల్లంఘించి విధులకు రాని సదరు ఉపాధ్యాయుల పై కఠిన చర్యలు తీసుకోవాల్సిందిగా కలెక్టర్ ఆదేశించడంతో విద్యాశాఖ ఈ చర్యకు పూనుకుంది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను పెంచేందుకు, విద్యార్థులకు నిరంతరాయంగా బోధన అందించేందుకు ప్రభుత్వం కఠిన నిర్ణయాలు తీసుకుంటున్న తరుణంలో ఈ ఘటన ఉపాధ్యాయులలో తీవ్ర భయాందోళనలు రేకెత్తిస్తోంది. హైదరాబాద్ జిల్లా పరిధిలోని పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులు ఇష్టారాజ్యంగా విధులకు హాజరు కావడం లేదని అందిన ఫిర్యాదులు, తనిఖీల ఆధారంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల ఇటీవల సికింద్రాబాద్ , కోఠి , జూబ్లీహిల్స్ , ఖైరతాబాద్ తదితర ప్రాంతాల్లో ఆకస్మికంగా పాఠశాలలను తనిఖీ చేశార . ఈ సందర్భంగా ముఖ గుర్తింపు పద్ధతి (ఎఫ్ఆర్ఎస్) అమలులో ఉన్నప్పటికీ ఎఫ్ ఆర్ ఎస్ నమోదు చేయకుండా, ముందస్తు సమాచారం లేకుండా గైర్హాజరు అయ్యారు. దీంతో వారిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేయడంతో విద్యాశాఖ అధికారులలో చలనం మొదలైంది.నోటీసులు జారీ – మారకపోతే సస్పెన్షన్..?: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచాలని ప్రభుత్వం నుండి వచ్చిన ఆదేశాలతో కలెక్టర్ దిద్దుబాటు చర్యలు తీసుకుంటున్నారు. కలెక్టర్ ఈ అంశంపై అత్యంత కఠినంగా స్పందించారు. విధుల్లో అలసత్వాన్ని ఏ మాత్రం సహించేది లేదని స్పష్టం చేస్తూ, వరుసగా రెండు రోజులు ముందస్తు అనుమతి లేకుండా విధులకు గైర్హాజరైతే తక్షణమే సస్పెన్షన్ వేటు వేయాలని అధికారులను ఆదేశించారు. ఈ క్రమంలోనే బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన 183 మంది ఉపాధ్యాయులపై తదుపరి చర్యలకు రంగం సిద్ధమైంది. ఇప్పుడు ఈ అంశం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. కలెక్టర్ ఆదేశాల మేరకు హైదరాబాద్ జిల్లా విద్యాశాఖాధికారి సదరు 183 మంది ఉపాధ్యాయులకు విడివిడిగా షోకాజ్ నోటీసులు జారీ చేశారు. తమ విధులకు ఎలాంటి సమాచారం లేకుండా ఎందుకు గైర్హాజరు కావాల్సి వచ్చిందో నిర్దిష్ట గడువులోగా రాతపూర్వక వివరణ ఇవ్వాలని ఆదేశించారు. సరైన కారణం లేదా ఆధారాలు చూపని పక్షంలో నిబంధనల ప్రకారం కఠినమైన క్రమశిక్షణా చర్యలు సస్పెన్షన్ లేదా సర్వీస్ రూల్స్ ప్రకారం ఇతర చర్యలు ఉంటాయని హెచ్చరించారు.ప్రధానోపాధ్యాయులపై సైతం..: హైదరాబాద్ కేవలం ఉపాధ్యాయుల పైనే కాకుండా, పాఠశాలల్లో ఉపాధ్యాయులు రాకపోయినా పట్టించుకోకుండా ఉదాసీనంగా వ్యవహరించే హెడ్‌మాస్టర్లు , మండల విద్యాధికారుల(ఎంఈఓ) పై కూడా విద్యాశాఖ నిఘా పెట్టింది. డుమ్మా కొట్టే టీచర్ల వివరాలు దాచాలని చూసినా లేదా వారిపై చర్యలు తీసుకోవడంలో జాప్యం చేసినా ఉన్నతాధికారుల పై కూడా శాఖాపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించింది. డీఈఓ ఏం చేస్తున్నారు..?: కలెక్టర్ పాఠశాలలను తనిఖీ చేసి గైర్హాజర్ అయిన వారి విషయంలో చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసేంత వరకు డీఈఓతో సహా ఇతర ఉన్నతాధికారులు గుర్తించకపోవడం, స్కూల్స్ తనిఖీ చేయకపోవడం వంటి వాటితో జిల్లాలో ఉపాధ్యాయులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. గత కొన్ని రోజులుగా డ్యూటీస్‌కు డుమ్మా కొట్టే టీచర్లపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం అంతటా చర్చనీయాంశంగా మారింది. డీఈఓ పాఠశాలలను తనిఖీ చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు సైతం వినబడుతున్నాయి. ఈ విషయమై డీఈఓ యాదయ్యను ఫోన్ ద్వారా వివరణ కోరేందుకు ప్రయత్నిస్తే ఆయన స్పందించలేదు.

ఘనంగా గాంధీ జయంతి వేడుకలు

టేకులపల్లి, : మండలంలోని బొమ్మనపల్లిలో కాంగ్రెస్ పార్టీ, యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో జాతిపిత మహాత్మా గాంధీ 157వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు, ఇల్లందు నియోజకవర్గ ఆత్మ కమిటీ డైరెక్టర్ బుర్ర ధర్మయ్యగౌడ్, బేతంపూడి సొసైటీ డైరెక్టర్ దోర్నాల విజయమోహన్‌రావు నాయకత్వంలో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు యాసారపు నరసయ్యగౌడ్, నారందాసు నరసింహారావు, బుర్ర మోహన్‌రావుగౌడ్, దోర్నాల శ్రీనివాస్, ఆకుల వెంకటేశ్వరరావు, మొగలగాని రాజుగౌడ్, బండి శంకర్‌గౌడ్, యాసారపు జానయ్యగౌడ్, జి.కొత్తతండా ఉపసర్పంచ్ మాలోతు కుమార్‌నాయక్‌తో పాటు యువజన కాంగ్రెస్ నాయకులు కొండాల సంతోష్, యాసారపు సత్యసాయిగౌడ్, బుర్ర రంజిత్‌గౌడ్, చర్లపల్లి శివగౌడ్, బాలాజీనాయక్, వాంకుదోత్ సందీప్‌నాయక్, వాంకుదోత్ రాజేష్‌నాయక్, బుర్ర రాజమణికంఠ, పోశం ప్రసాద్ తదితరులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కృత్రిమ మేధస్సు - రేపటి తరానికి ముప్పు!!

కోడింగ్ రాసిన కావ్యాల లోపల
జ్ఞానపు లోతులు తరిగిపోయే
కంటిపాపల స్వచ్ఛమైన సృజనను
సిలికాన్ చిప్పులు మింగేసే!
అక్షరాల వెనుక ఆత్మ లేదు
మెదడు నాడులు మొద్దుబారే
కంప్యూటర్ స్క్రీన్ల వెలుతురులో
నిజమైన మేధస్సు మంటకలిసే!
ప్రాణం లేని అల్గోరిథం వలలో
యువతరం ఆలోచన
చిక్కుకుపోయే
పలకా బలపం పక్కన పడేసి
యంత్రాలకే బానిసగా మారే!
సహజమైన ఊహల లోకాన్ని
డిజిటల్ మాయాజాలం శాసించే
రెప్పల చాటున దాగిన ఆశలు
డేటా సర్వర్లలో బందీ ఆయే!
మనుషుల నడుమ బంధాలన్నీ
వర్చువల్ నీడలుగా మారిపోయే
ఈ రోబోల సామ్రాజ్యపు వేగంలో
మానవ మనుగడే శూన్యమయ్యే!
యంత్రం మనకు సేవకుడే కానీ
సృష్టిని శాసించే శక్తి కాకూడదు
మానవ సంకల్పపు వెలుగుల ముందర
సాంకేతిక ముప్పు ఎప్పుడూ గెలవలేదు!



-జాటావత్ రాజు
(యువ కవి,రచయిత)
తెలంగాణ
విశ్వవిద్యాలయం,
నిజామాబాద్.



విద్యుత్ షాక్‌తో భార్యాభర్తల మృతి..!



గంభీరావుపేట, చర్చావేదిక : పంటను అడవి పందులు, కోతుల బారి నుంచి కాపాడుకునేందుకు పొలానికి వెళ్లిన భార్యాభర్తలు.. తిరిగి ఇంటికి చేరుకోకుండానే విగతజీవులుగా మారిన విషాద ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంలో చోటుచే సుకుంది. విద్యుత్ షాక్‌కు గురై గంభీరావుపేటకు చెందిన రైతు దంపతులు గంట దేవయ్య (55), గంట లక్ష్మి (46) మృతిచెందారు. గంభీరావుపేటకు చెందిన దేవయ్య, లక్ష్మి దంపతులు ఇంట్లో ఇద్దరే నివసిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉండగా.. వారికి ఇప్పటికే వివాహాలు జరిగాయి. దంపతులు కౌలుకు తీసుకున్న పొలంలో వరి పంట కోతకు సిద్ధంగా ఉంది. పంటను కోతులు, అడవి పందుల నుంచి రక్షించుకునేందుకు గురువారం వ్యవసాయ పనుల నిమిత్తం పొలానికి వెళ్లారు. అయితే రాత్రి అయినా దంపతులు ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. శుక్రవారంఉదయం పంట పొలాల వైపు వెళ్లిన రైతులు.. అక్కడ దేవయ్య, లక్ష్మి విగతజీవులుగా పడి ఉండటాన్ని గుర్తించారు. వెంటనే కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. ప్రాథమికంగా విద్యుత్ షాక్ కారణంగానే దంపతులు మృతిచెందినట్లు తెలుస్తోంది. అయితే ప్రమాదానికి దారితీసిన పూర్తి కారణాలు, పొలంలో విద్యుత్ ప్రవాహం ఎలా ఏర్పడిందనే అంశాలపై పోలీసుల దర్యాప్తులో స్పష్టత రావాల్సి ఉంది. పంటను కాపాడుకునేందుకు పొలానికి వెళ్లిన దంపతులు.. ఇంటికి తిరిగి రాకుండానే మృత్యువాత పడటంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఒకే కుటుంబానికి చెందిన దంపతులు మృతిచెందడంతో గంభీరావుపేటలో విషాదచాయలు అలుముకున్నాయి.

పంట నష్టానికి పరిహారం ఇవ్వాలి

ఆర్ పి జి విత్తనాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి
ఏ ఎస్ యు జిల్లా ఉపాధ్యక్షుడు పెందోర్ మహేందర్



జననినాదం,సిరికొండ 02: ఆర్ పి జి విత్తనాలతో పంట సాగు చేసి నష్టపోయిన తిమ్మాపూర్ ప్రాంత రైతులకు తక్షణమే పరిహారం అందించాలని ఆదివాసీ విద్యార్థి సంఘం (ఏ ఎస్ యు) జిల్లా ఉపాధ్యక్షుడు పెందోర్ మహేందర్ అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని మారుమూల ప్రాంతాల్లో పర్యటించి రైతుల పంటలను పరిశీలించారు. రైతులు ఏ ఎస్ యు సంస్థకు చెందిన విత్తనాలను సాగు చేశారని, పంటకు ఎన్ని మందులు పిచికారీ చేసినా ఆశించిన స్థాయిలో వూత రాకపోవడంతో పంట దిగుబడి తగ్గి తీవ్రంగా నష్టపోయారని, ప్రతి విత్తన బ్యాగుకు రూ. 10 వేల చొప్పున నష్టపరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. రైతుల సమస్యను సంబంధిత అధికారులు, ఏ ఎస్ యు సంస్థ ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా కృషి చేస్తానన్నారు. రైతులకు న్యాయం జరిగే వరకు వారి తరఫున పోరాటం కొనసాగిస్తామని ఆయన పేర్కొన్నారు.

వన్యప్రాణులను సంరక్షించడం అందరి బాధ్యత

రించాలని సిరిచేల్మా రేంజ్ అధికారి కే. శ్రీనివాస్
బైక్ ర్యాలీ.. అవగాహన సదస్సు



జననినాదం,సిరికొండ 02: వన్యప్రాణులను సంరక్షించడంతో పాటు అడవుల వరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సిరిచేల్మా రేంజ్ అధికారి కే. శ్రీనివాస్ అన్నారు. వన్యప్రాణి వారోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం సిరికొండలో అటవీశాఖ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామసభలో వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అడవులు, వన్యప్రాణులు ప్రకృతి సమతుల్యతకు ఎంతో కీలకమన్నారు. వన్యప్రాణుల సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించడమే వారోత్సవాల ప్రధాన ఉద్దేశమన్నారు. వన్యప్రాణులు గ్రామాల వైపు వచ్చినప్పుడు వాటిని ఇబ్బందులకు గురిచేయకుండా అటవీశాఖ అధికారులకు సమాచారం అందించాలన్నారు. అడవులను నాశనం చేయకుండా, వన్యప్రాణుల ఆవాసాలను కాపాడేందుకు ప్రజలు సహకరించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిరికొండ డిప్యూటీ రేంజ్ అధికారి సీహెచ్. ప్రియాంక, సిరిచేల్మా రేంజ్ అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మిషన్ భగీరథ లీకేజ్..

పట్టించుకోని మున్సిపల్ అధికారులు

శంకర్ పల్లి: శంకర్ పల్లి మున్సిపల్ పరిధిలో వేసవి రాకముందే మంచినీటి సమస్య తీవ్ర రూపం దాల్చింది. మిషన్ భగీరథ నీటి సరఫరా చేస్తున్నప్పటికీ మున్సిపల్ అధికారుల నిర్వాకం వల్ల పైప్ లైన్లు లీకై నీరంతా రోడ్డు పాలవుతున్న తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండటం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రహదారుల వెంబడే పైప్ లైన్ లీకై నిరంత రోడ్డు పాలవుతున్న సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. శంకర్పల్లి నుంచి సంగారెడ్డి వెళ్లే రోడ్డు వెంబడి బాలాజీ సూపర్ మార్కెట్ పక్కన క్రిస్టల్ గార్డెన్ వెళ్లే దారిలో పైప్ లైన్ లీకై సుమారు 20 రోజులు గడుస్తున్నా ఎవరు పట్టించుకోవడం లేదు. ఓవైపు వర్షాలు కురవక నీటి ఎద్దడి ఏర్పడుతుందని ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని అధికారులు చెబుతూ ఇక్కడేమో ఉన్న నీటిని రోడ్డు పాలు చేస్తున్నారు. సుమారు ఇక్కడ 20 రోజుల నుంచి నీటి సరఫరా ఉన్నంతసేపు నీరంతా లీకై వృధాగా పోతోంది. ఇదే రహదారి వెంబడి నెల రోజుల క్రితం అయ్యప్ప పాల కేంద్రం ఎదురుగా సబ్ స్టేషన్ పక్కన పైప్ లైన్ లీకై నెలరోజుల పాటు నీరు దాకా పోయింది. ప్రధాన రహదారి వెంబడే ఇలాంటి పరిస్థితి ఉంటే ఇక గల్లీలలో పరిస్థితి మరి దారుణం గా తయారయింది. మంచినీటి నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. మిషన్ భగీరథ నీటిని నిలువ చేసుకోవడానికి సరైన ట్యాంకులు లేకపోవడం ఉన్న నీరు కూడా రోడ్డుపాలవు తుంటే గుండె తరుక్కు పోతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుళాయిల ద్వారా రోజు విడిచి రోజు దేవుడెరుగు మూడు రోజులకు ఒకసారి కూడా నీరు సక్రమంగా రావడం లేదని ఇప్పటికైనా మునిసిపల్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

బెల్లంపల్లి పట్టణంలో..

ఘనంగా మహాత్మగాంధీ జయంతి వేడుకలు



బెల్లంపల్లి: బెల్లంపల్లి పట్టణంలో జాతి పిత మహాత్మగాంధీ జయంతి వేడుకలు అట్టహాసంగా జరిగాయి. కాంగ్రెస్ పార్టీ కార్యాలయం లో జరిగిన వేడుకల్లో మున్సిపల్ చైర్ పర్సన్ దావస్వాతి పాల్గొన్నారు. గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మునిసిపల్ కార్యాలయంలో మహాత్మా గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మునిసిపల్ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి మున్సిపల్ చైర్ పర్సన్ దావస్వాతి, మునిసిపల్ కమిషనర్ తన్నీరు రమేష్ నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చిలుము ల శంకర్, దావరమేశ్, మునిసిపల్ కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

మహాత్మా గాంధీజీకి ఘన నివాళి



వరంగల్ : జాతిపిత మహాత్మా గాంధీజీ జన్మదినం సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో మహాత్మా గాంధీజీ చిత్రపటానికి వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగాకమిషనర్‌మాట్లాడుతూ, మహాత్మా గాంధీజీ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరించి సమాజంలో శాంతి, సామరస్యం, సోదరభావాన్ని పెంపొందించాలని పిలుపునిచ్చారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీస్ శాఖ నిబద్ధతతో పనిచేస్తూ, ప్రజలతో సత్సంబంధాలను కొనసాగిస్తూ విధులు నిర్వహిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ ధార కవిత,అడిషనల్ డీసీపీ (అడ్మినిస్ట్రేషన్) రాయల ప్రభాకర్ రావు, అడిషనల్ డీసీపీలు, ఏసీపీలు, ఏఆర్ ఉ సివిల్ పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొని మహాత్మా గాంధీజీకి ఘనంగా నివాళులర్పించారు.



యథేచ్ఛగా మద్యం విక్రయాలు

గాంధీ జయంతి రోజే..

అక్రమ మద్యం జోరు

వెంకటాపూర్, రామప్ప: గాంధీ జయంతి రోజున సైతం మద్యం విక్రయాలు యథేచ్ఛగా సాగుతున్నాయనే ఆరోపణలు వెంకటాపూర్ మండలంలో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. మద్యం విక్రయాలు పూర్తిగా నిషేధించే డ్రై డే రోజున కూడా బెల్ట్ షాపులు తెరిచి బహిరంగంగా మద్యం విక్రయిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. నిబంధనలను ఉల్లంఘిస్తూ సాగుతున్న ఈ అక్రమ మద్యం దందాపై సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. యునెస్కో గుర్తింపు పొందిన ప్రపంచ వారసత్వ సంపద రామప్ప ఆలయానికి వెళ్లే ప్రధాన రహదారిలోని వెంకటాపూర్ బస్టాండ్ వద్దే బెల్ట్ షాపులు బహిరంగంగా నిర్వహిస్తున్నారని స్థానికులు చెబుతున్నా రు. దేశ, విదేశాల నుంచి వచ్చే పర్యాటకులు, భక్తులు, మహిళలు, చిన్నారులతో నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో మద్యం విక్రయాలు కొనసాగుతుండటంపై ఆందోళన వ్యక్తమవుతోంది. మద్యం సేవించిన కొందరువ్యక్తులు బహిరంగ ప్రదేశాల్లో అసభ్యంగా ప్రవర్తిస్తూ, అల్లర్లకు పాల్పడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో పర్యాటకులు, ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెబుతున్నారు. అధికారుల కార్యాలయాలకు సమీపంలోనే..: వెంకటాపూర్‌లోని బెల్ట్ షాపులకు సమీపంలోనే మండల రెవెన్యూ కార్యాలయం, ఎంపీడీఓ కార్యాలయం, పోలీస్ స్టేషన్ ఉన్నప్పటికీ అక్రమ మద్యం విక్రయాలు కొనసాగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారుల కార్యాలయాలకు సమీపంలోనే ఈ వ్యవహారం జరుగుతున్నా చర్యలు లేకపోవడంపై వారు ప్రశ్నిస్తున్నారు. అక్రమ మద్యం విక్రయాలపై సంబంధిత శాఖలు దృష్టి సారించి, నిబంధనలు ఉల్లంఘిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

గ్రామంలో 20కిపైగా బెల్ట్‌షాపులా?: వెంకటాపూర్ గ్రామంలో 20కి పైగా అక్రమ బెల్ట్ షావులునిర్వహిస్తున్నారనే ఆరోపణలువినిపిస్తున్నా యి. అనధికారికంగా మద్యం అందుబాటులో ఉండటంతో స్థానిక యువత మద్యానికి బానిసలుగా మారుతున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ముఖ్యంగా రాత్రి వేళల్లో మద్యం సేవించిన కొందరు వ్యక్తులు వీధుల్లో హల్‌చల్ చేస్తూ ప్రయాణికులు, వాహనదా రులను ఇబ్బందులకు గురిచేస్తున్నారనిఆరోపిస్తున్నారు.దీంతో గ్రామంలో భయానక వాతావరణం నెలకొంటోందని స్థానికులు చెబుతున్నారు. మద్యం రహితగ్రామంగా మార్చాలనిడిమాండ్: అక్రమ మద్యం విక్ర యాల కారణంగా యువత భవిష్యత్తు దెబ్బతింటోందని గ్రామ పెద్దలు, మహిళా సంఘాలు, పొదుపు సంఘాలు, స్వయం సహాయక సంఘాల సభ్యులుఆందోళన వ్యక్తం చేస్తున్నారు.గ్రామంలో అక్రమ బెల్ట్ షాపుల ను అరికట్టి వెంకటాపూర్‌ను మద్యం రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.
గాంధీ జయంతి రోజూ విక్రయాలపై ప్రశ్నలు: గాంధీ జయంతి వంటి డ్రై డే రోజున కూడా మద్యం విక్రయాలు కొనసాగుతున్నాయనే ఆరోపణలు రావడం అధికారుల పర్యవేక్షణపై ప్రశ్నలు రేకెత్తిస్తోంది. అక్రమ మద్యం విక్రయాలకు అడ్డుకట్ట వేయాల్సిన పోలీస్, ఎక్సైజ్, రెవెన్యూ శాఖల అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అక్రమ మద్యం దందా వెనుక కొందరు అధికారులకు మామూళు అందుతున్నాయనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయని వారు చెబుతున్నారు. అయితే ఈ ఆరోపణలపై సంబంధిత అధికారులు స్పందించాల్సి ఉంది.

జిల్లా జైలులో ఘనంగా ఖైదీల సంక్షేమ దినోత్సవం



మహబూబ్ నగర్ : గాంధీ జయంతి సందర్భంగా జిల్లా జైలులో ఖైదీల సంక్షేమ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమా నికి ప్రిన్సిపల్ డ డిస్ట్రిక్ట్ జడ్జి ప్రేమలత ముఖ్యఅతిథిగా హాజరుకాగా, జిల్లా ఎస్పీ డి.జానకి, విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. ఈ నందర్భంగా మహాత్మా గాంధీ గారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఖైదీల నంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని నిర్వహించిన కార్యక్రమంలో ఖైదీలతో అధికారులు మాట్లాడారు. జిల్లా ప్రిన్సిపల్, డిస్ట్రిక్ట్ జడ్జి ప్రేమలతమాట్లాడుతూ, ఖైదీలు చేసిన తప్పులను పునరావృతం చేయకుండా, జైలు జీవితాన్ని తమలో మార్పు తీసుకురావడానికి ఒక అవకాశంగా భావించాలని సూచించారు. క్రమశిక్షణతో జీవిస్తూ, జైలు నుంచి బయటకు వెళ్లిన అనంతరం సమాజంలో గౌరవప్రదమైన జీవితాన్ని కొనసాగించేందుకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని తెలిపారు. న్యాయపరమైన సహాయం అవసరమైన ఖైదీలకు అందుబాటులో ఉన్న న్యాయ సేవలను వినియోగించుకోవాలని సూచించారు.జిల్లా ఎస్పీ డి.జానకి, మాట్లాడుతూ, మహాత్మా గాంధీ చూపిన సత్యం, అహింస, శాంతి మార్గాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. ఖైదీల సంక్షేమం, వారి పునరావాసం, సమాజంలో తిరిగి గౌరవప్రదమైన జీవితాన్ని ప్రారంభించేలా ప్రోత్సహించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. జైలు శిక్ష అనేది జీవితానికి ముగింపు కాదని, తమలో మార్పు తెచ్చుకొని భవిష్యత్తును మంచిగా తీర్చిదిద్దుకునేందుకు ఒక అవకాశంగా భావించాలని ఖైదీలకు సూచించారు.ఖైదీలు కూడా తమలో సానుకూల మార్పు తీసుకువచ్చి, భవిష్యత్తులో చట్టాన్ని గౌరవిస్తూ మంచి పౌరులుగా జీవించాలని ఎస్పీ గారు ఆకాంక్షించారు. జైలు సిబ్బంది ఖైదీల సంక్షేమం, భద్రతతో పాటు వారి మానసిక, సామాజిక పునరావాసానికి అవసరమైన సహకారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ కాళిదాస్, ఇందిరా, శ్రీనివాస్,వెంకటేశ్వర్లు తదితర అధికారులు, సిబ్బంది మరియు ఖైదీలు పాల్గొన్నారు.

గాంధీ ఆశయాలను ఆచరించాలి

సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు గోపాల్



జననినాదం,తిర్యాణి 02: మహాత్మా గాంధీ చూపిన సత్యం, అహింస, స్వచ్ఛత మార్గాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు, మందగూడ సర్పంచ్ తురం గోపాల్ అన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం మందగూడ గ్రామంలో గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీజీ ఆశయాలను ఆచరణలో పెట్టడం ద్వారా సమాజంలో మార్పు తీసుకురావచ్చన్నారు. గ్రామాల్లో పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలన్నారు. గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. గ్రామాలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

యువ కవి, రచయిత రైటర్ రాజు ని సత్కరించిన

బండ్లగూడ హాస్టల్ వార్డెన్ ప్రవీణ్!



హైదరాబాద్: చంద్రయాన్ గుట్ట02: బండ్లగూడలోని జహీంగీరాబాద్ లో ఉన్న గిరిజన బాలుర వసతి గృహం వార్డెన్ ప్రవీణ్ గారు జాటావత్ రాజు (యువ కవి, రచయిత) రైటర్ రాజు కి ఘనంగా శాలువాతో సన్మానించారు. అదేవిధంగా రాజు మంచి గురించి విద్యార్థులకు తెలియజేశారు. తను ఎంతో శ్రమించి తన విద్యార్థి దశలో ఎన్నో పురస్కారాలు మరియు అవార్డులు అందుకున్నారు తనకంటూ ఒక ప్రత్యేకతను సృష్టించుకున్నారు. నేటి తరానికి, మన హాస్టల్ కి తను ఒక గర్వకారణంగా నేను భావిస్తున్నాను కొనియాడారు. అలాగే హాస్టల్ లో ఉన్న విద్యార్థులు రాజు ని ఆదర్శంగా తీసుకోవాలి తెలిపారు. అదే సందర్భంలో రాజు భవిష్యత్తులో కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారం అందుకోవాలని తెలియజేశారు. అలాగే తన భవిష్యత్తులో ఉన్నత స్థాయి ఎదగాలని కొనియాడారు. సమాజాన్ని మార్చే విధంగా మరెన్నో రచనలు చేయాలని సమాజాన్ని చైతన్యం పరచేలా రచనలు చేయాలని తెలియజేశారు. హాస్టల్ లో ఉన్న విద్యార్థులందరూ చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని, మంచి ఉద్యోగాలు సంపాదించాలని తెలియజేశారు.

Printed, Published and Ownedby **JADAV ROHIDAS,** and Printed at RATNA GRAPHICS Printing press (Name&Adress) 2-3-703/7,Tirumalanagar colony,amberpet,policeline,Hyderabad,Telangana-500013 Published from H.No 12-27 Village;FatkalMangi,Mandal;Lingapur, Kumrambheem Asifabad, Adilabad,Mancherial,TELANGANA-504293.**Editor: JADAV ROHIDAS.RNI NO:TGTEL/25/A0870, Email: jananinadam@gmail.com**.Phone no:9550100197,9490111460